# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 30 Issue 7

No.of Pages 40

MARCH 2011

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


ఈ సంచికలో.... పేజీ


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మ ఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీ అభిభాషణ | 8 |
| సన్నిధిలో సంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| ఉపాసన అంటే ఏమిటి? | 15 |
| సాధనోపదేశ చతుష్టయము | 18 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 20 |
| బెంగుళూరులో శ్రీమాతాజీ | 22 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 24 |
| సమర్థ సద్గురు నాధుని దివ్యచరిత్ర | 26 |
| గిరిజా విజయం | 28 |
| గురుబిడ్డ | 30 |
| మన సాధన ఎందుకు ఫలించటంలేదు? | 32 |
| శ్రీసద్గురు చండీ రుద్రయాగం నివేదిక | 34 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

అదృష్ట మవ్యవహార్య మగ్రాహ్య మలక్షణ మచిన్త్య
మవ్యపదేశ్యమేకాత్మ ప్రత్యయసారం ప్రపంచో
పశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మాసవిజ్ఞేయః

ఆత్మ వస్తువు చూడనలవి కానిదని. వ్యవహరింపనలవికానిదని, ఏలక్షణాలు లేనిదని, చింతింప శక్యము కానిదని, ఇదమిత్థమని వ్యాఖ్యానించ లేని, ఏకాత్మ జ్ఞానసారమై, ప్రళయభూతమై, శాంతము, మంగళ స్వరూపము, అద్వైత రూపమని వివేకులైనవారు భావన చేస్తారు. మరి దానిని సాధకులు, వివేకులు చెప్పినది శ్రవణం చేసి సంతోషించటమేనా? తప్పక తెలుసుకో వలసినదే. ప్రతి సాధకుడు దానికి తగిన ప్రయత్నం చేయవలసినదే.

శ్రీబాబూజీ మహరాజ్ బోధ చేస్తూ "సగుణంగా స్వామితో సంచరించవచ్చు. సంభాషణ చేయవచ్చు. కాని సగుణంగా దర్శించిన స్వామి యొక్క నిర్గుణ నిరాకార సౌందర్యాన్ని దర్శించినపుడే ధన్యత్వాన్ని పొందేది. దేహభావన ఉన్నంతవరకు అది అసంభం. మరి జ్ఞానులు, అనుభవజ్ఞులు చెప్పినది యదార్థము కాదా! నమ్మశక్యంగా లేదా? అనుభూతిని పొందిన వాడికి, పొందని వాడికి వ్యత్యాసం ఉండదా? తప్పక ఉంటుంది.

అనుభూతి పొందిన వాడు నిరహంకారియై, నిరాడంబరియై. నిత్యసంతోషియై వ్యవహరిస్తాడు. అతనిలో ఆశ అసంతృప్తి ఉండవు. వినయ విధేయత, త్యాగము, అతని సొత్తు. ఇవేవీ లేని సాధకుడిది వాచావేదాంతమే. ఆత్మానుభూతిని పొందిన శిష్యుడు గురువే నా రక్షకుడు, కర్త, భర్త, హర్త అనే భావం దృఢమై **గురోరన్యం న భావయేత్** అన్న భావనే మనస్సులో నిలిచిపోతుంది. కాబట్టి ఆత్మవస్తువుని గురించి సగుణంగా తెలుసుకోలేమనే భావన కాదు కావలసింది నిర్గుణ తత్త్వాన్ని తెలుసుకోవాలి. అదే జ్ఞానం అప్పుడే జన్మరాహిత్యం. మనస్సు బుద్ధిలో లయమై ద్వైతము నశించినప్పుడే అది సాధ్యపడుతుంది. అదే సమాధి స్థితి. అదే ఆనందము అన్నారు శ్రీబాబూజీ మహారాజ్. *

# అమ్మ ఆశీస్సులు

చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం
చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమాం ॥
భేషజం భవరోగిణాం అఖిలాపదా మపహారిణం ।
దక్షయజ్ఞ వినాశనం త్రిగుణాత్మకం త్రివిలోచనం ।
భుక్తి ముక్తి ఫల ప్రదం సకలాఘ సంఘనిబర్హణం
చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః ॥

భక్త మార్కండేయుడు సదాశివుని గురించి చేసిన ప్రార్థన. సాధక లోకానికి ఇది ఒక నిదర్శనం. చంద్రశేఖరుని ఆశ్రయించిన నాకు యముడు ఏమిచేయగలడు అంటున్నాడు. భవరోగములకు మందు, అఖిల ఆపదలను హరించేవాడు, దక్షయజ్ఞమును వినాశమును చేసినవాడు, త్రిగుణములకు మూలమైనవాడు, మూడు నేత్రములు కలిగినవాడు, భుక్తి, ముక్తి ఫలమును ప్రసాదించేవాడు, సకల పాపసంచయమును దహించేవాడు అయిన చంద్ర శేఖరుడు అంటున్నాడు శ్రీ మార్కండేయునికి ఉన్న అచంచల భక్తి ఎవరికైతే తను ఆశ్రయించిన ప్రభుని యందు ఉంటుందో వారందరూ శ్రీమార్కండేయుని వలె మృత్యుంజయులే అవుతున్నారు.

శ్రీసద్గురుదేవులు బోధామృతమునందు అందరికీ దీనినే అందిస్తూ ఎవరైతే బ్రతికి ఉండగానే చనిపోతారో, మృత్యువును గుర్తిస్తారో వారికిక మృత్యువు చావులేదు అని చెబుతూ ఉండేవారు.

ఇట్టి పరశివ స్వరూపుని శ్రీసద్గురు చండీరుద్రయాగము ఫిబ్రవరిలో తుని పట్టణము నందు పూర్తి చేసుకుని భక్తులందరూ శ్రీమాఘపూర్ణిమ గురుపూర్ణిమను ఆశ్రమము నందు ఎంతో వైభవంగా "శివుడే సద్గురు రూపమును స్వీకరించి వచ్చెనే" అని అనుభవిస్తూ తత్త్వస్వరూపునికి పూజలు, సత్సంగము జరిగినవి.

ఇంతలో మహాశివరాత్రి పర్వదినము భక్తకోటి చేత బోళాశంకరుడు శివశివా! హరహరా! శంభోమహాదేవా! అనుకుంటూ అభిషేకములతో సంతృప్తిపడుతూ భక్తులను సంతృప్తులను చేస్తాడు ఆ మహాదేవుడు. అట్టి సకల దేవతా స్వరూపుడైన శ్రీసద్గురుదేవుల కృప మనందరిపై వర్షించుగాక!

-మీ అమ్మ

# సంపాదకీయం

-పరాశర ప్రసాద్

యావత్ప్రపంచం దుర్భిక్షం, తుఫానులు, రోగభయాలు, యుద్ధభీతి, ఈర్ష్య, అసూయ, రాగద్వేషాలతో అశాంతి, కరువు కాటకాలతో సతమత మవుతున్న తరుణంలో వేదప్రతిపాదిత కర్మలలో అత్యంత ప్రాధాన్యత కలిగిన శ్రీసద్గురు చండీరుద్ర యాగం స్వార్థ రహితంగా ప్రజా సంక్షేమం కోసం శ్రీ యోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీవారు పర్యవేక్షించి, శ్రీబాబు భక్తసమాజ్ తునివారిచే నిర్వహింపజేసిన కార్యక్రమం ఎంతో ఘనమైనది. శ్రమతో ధనవ్యయముతో కూడినది.

అంతేకాదు శ్రీసద్గురు చండీ రుద్రయాగముతో శ్రీ సాధు ధర్మ సమ్మేళనమనే బ్రహ్మయజ్ఞము కూడా నిర్వహించి, ఏ రకమైన వ్యయ ప్రయాసలూ లేని తాపసోత్తములకు అలభ్యమయ్యే సదావకాశాన్ని కలుగజేసి, గురుతత్త్వమనే హవిస్సు చెవులతో శ్రవణము ద్వారా స్వీకరించి, మనమంతా జీవితకాలంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని మళ్ళీ చేయకుండా ఉండునట్లు తోడ్పడే గురుబోధను అందుకోగల్గటం మనందరి అదృష్టం.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఋత్విక్కులు, కార్యకర్తలు, సేవకులు, ఆస్తికమహాశయులు, భక్తులు, సేవా ప్రచారకులు యావన్మంది శ్రీసద్గురుదేవుల కృపకు పాత్రులగుదురు గాక! అని ప్రార్థిస్తూ...........

-పరాశర ప్రసాద్

(గౌరవ సంపాదకుడు)

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

భగవన్నామం చాలా రుచికరమైనది. మధురమైనది. శరీర బలాన్ని, మనోబలాన్నికూడా యిస్తుంది. మానవుడు ఉద్ధరింప బడాలంటే భగవతత్త్వాన్ని చక్కగా అర్థం చేసుకోవాలి. అచంచలమైన విశ్వాసంతో భగవద్ధ్యానం చేసుకున్న మానవుడు ఎట్టిఆపదలలో ఉన్నా, సర్వదా రక్షణ పొందగలడు. అలా తనను అనన్య దృష్టితో చింతించే వారిని, ధ్యానించే వారిని, స్మరించే వారిని, వారి యోగక్షేమాలను గూర్చి తాను స్వయంగా చూసుకుంటానని భగవానుడే శెలవిచ్చాడు. భగవానుడిచ్చిన అభయం ఎన్నటికీ అసత్యం కాదు. ఆయన సత్యదేవుడు. సత్యస్వరూపుడు, నిత్యుడు, శాశ్వతుడు, నిర్మలాత్ముడు.



అటువంటి పరమాత్మ దేవకీ వసుదేవుల గర్భ వాసాన జన్మించాడు. అంటే వారెంతో పునీత దంపతులని, ఎంతో పవిత్రము, ఉత్తమము అయిన సంస్కారం గల వారని మనం గ్రహించవచ్చు. సకల లోకాలకు తండ్రియైన ఆ ప్రభువుకే తల్లిదండ్రులనిపించుకొన్న వారెంత ధన్య చరిత్రులు! ఎంతో కఠోర తపస్సు ఫలితంగా వారు శ్రీనారాయణ మూర్తిని తమ పుత్రుడుగా పొందగలిగారు. ఆ క్షణమే వారు తమ కరచరణ బంధముల నుండే గాక భవబంధముల నుండి కూడా విముక్తి పొందారు.

అయితే భగవానుడు కూడా గర్భనరకం అనుభవించాడా? లేదు. చతుర్భుజాలతో, శంఖ, చక్ర, గదాధ్యాయుధాలతో శ్రీమహా విష్ణువుగా వారికి దర్శనమిచ్చి, వసుదేవునికి తనను నందుని యింట చేర్చమని కర్తవ్యం బోధించి, మరుక్షణమే అందాలు చిందే పసికందుగా దేవకి పొత్తిళ్ళలో ప్రత్యక్షమైనాడు. వసుదేవుని కర్తవ్యానికి అడ్డు లేకుండా జైలు తాళాలు ఊడిపోయాయి. కవాటాలు తెరచుకొన్నాయి. కాపలావాళ్ళు మొద్దునిద్రలో మునిగిపోయారు. యమున చిరు పాదాలు ముద్దాడి దోవ యిచ్చింది. వరుణదేవుడు, వాయుదేవుడు ఆ బాల పరమాత్మను సేవించుకున్నారు. అనంతుడు ఛత్రం పట్టాడు. వ్రేపల్లెలో అందరు తమోగుణంలో మునిగిపోయారు. యశోద ప్రక్కన ఆ పసిబాలుని వసుదేవుడు ఉంచటం, యశోద ప్రక్కలో శిశువు రూపంలో ఉన్న

యోగమాయను తీసుకుని తిరిగి కారాగారం చేరుకోవటం, అంతా క్షణాలలో జరిగిపోయింది. జరిగిన యీ అద్భుతమంతా ఆ బాల భగవానునికి తప్ప మరెవరికీ తెలియదు. వసుదేవునికి కూడా ఇదంతా మరపు వచ్చేట్లు చేశాడు భగవానుడు.

ఇలా అవతార ప్రారంభానికి ముందు నుంచే, దివ్య లీలలను ప్రదర్శించి లోకోద్ధరణ కార్యక్రమానికి పూనుకున్న పరమాత్ముని గూడ అర్థం చేసుకోలేక వ్యర్థులైనారు దుర్యోధన వర్గం వారు. జారుడని, చోరుడని, కులహీనుడని శ్రీకృష్ణుని నిందించారు. తమోగుణంలో ఉన్న వారికి, మంచిని చూడలేని వారికి, కొండాలు చెప్పేవారికి శాంతి ఉండదు. అటువంటి జ్ఞానహీనులు తాము శాంతిని పొందలేరు. ఎదటి వాడిని శాంతిగా ఉండనివ్వలేరు. వాళ్ళు మగ్గిన మామిడి పళ్ళతో ఉన్న చెట్టు చుట్టూ మొలిచిన దూలగొండ మొక్కల వంటివారు. ఆ దూలగొండ మొక్కలు ఆ పళ్ళను అనుభవించలేవు. ఇతరులను ఆ చెట్టు దగ్గరకు చేరనివ్వవు. సజ్జనుని వద్ద చేరిన దుర్జనులు అటువంటి వారు. దాత వద్ద, కుత్సిత మనస్సు గలవారు, మూర్ఖులు, లోభత్వం గలవారు జేరితే, ఆ దాత యొక్క ప్రకాశము పొగ కమ్మినట్లు అవుతుంది. అందుచేతనే సాధకులైన వారు, ఎంత ప్రయత్నం అయినా చేసి విధిగా దుర్జనులకు దూరంగా ఉండాలి. అపుడే వారి సాధన సాగుతుంది.

మానవ జన్మ 84 లక్షల జీవరాసులలోను గొప్పది. ఆత్మ దర్శనం చేసుకుని ఆత్మానందాన్ని అనుభవించటానికి, ~~ఈ~~ 84 లక్షల జీవరాసులలోను పుడుతూ, చస్తూ, జనన మరణ విష వలయంలో చిక్కుకుపోయిన బంధం నుండి శాశ్వత విముక్తి పొంది, మళ్ళీ జన్మ లేకుండా చేసుకోవటానికి యీ మానవజన్మ వచ్చింది. అయితే సత్త్వ రజ స్తమో గుణములతో కూడిన మనస్సు అనుక్షణము ప్రాపంచిక సుఖాల వైపు పరుగులు తీస్తూ మానవునికి యిసుమంతైనా శాంతి లేకుండా చేస్తుంది. ఇంద్రియాలు చాలా బలీయములైనవి. వాటిని కంట్రోల్ చేసే మనస్సు అంతకంటె బలీయమైనది. ఆ మనస్సు రాగద్వేషాలతో, దుష్ట సంకల్పాలతో మలినమైతే, దాని నుండి నీచ భావాలే వస్తాయి. ఇంద్రియ సుఖాల యందు ఆసక్తమైన మనస్సు మలిన మనస్సు అని, అది మానవుని జనన మరణ వలయంలో బంధించి వేస్తుందని, విషయ రహితమై శుద్ధమైన మనస్సు ముక్తికి దోవ చూపుతుందని అమృత

బిందూపనిషత్తు చెబుతున్నది. మలిన మనస్సు గలవానికి పాపభీతి ఉండదు. అటువంటి మనస్సును అరికట్టలేనివారు పరమ సత్యానికి, అంటే ఆత్మ స్వరూపానికి, మరింత దూరమైపోతూ, అనేక దుఃఖాలకు, అశాంతికి గురు అవుతారు. వితండ వాదానికి పూనుకుంటారు. భగవద్దృష్టి కలగనే కలగదు. బాహ్య ప్రపంచ విషయాలు, దుష్కృత కార్యములు మాత్రమే రుచిస్తాయి.

మలిన మనస్కునికి అజ్ఞానము మొసలి చర్మము లాగా దట్టంగా ఆవరించి ఉంటుంది. మహనీయుల దర్శనము, వారి చక్కని హితోపదేశాలు అతనికి ఏ మాత్రము రుచికరించవు. అటువంటి దుర్జనుడికి సలహా యివ్వటం, మంచి మాట చెప్పటం కూడా ప్రమాదమే. ఒక కోతి అడవిలో ఒక చలికాలపు రాత్రివేళ ఒక చెట్టు క్రింద చలి కాచుకోవటానికి ఎండుపుల్లలు పోగు చేసింది. వాటిని ముట్టించడానికి నిప్పు కోసం వెదుకుతుండగా మిణుగురు పురుగులు ఎగురుతూ కనిపించాయి. వాటి కాంతిని చూసి, అవి నిప్పురవ్వలనుకుని, వాటిని పట్టుకుని ఆ పుల్లల పైన పైన వేసి నిప్పు ముట్టించాలనుకుంది. అది పడే శ్రమ చూసి జాలిపడి, ఆ చెట్టుపైనే ఉన్న ఒక చిలుక ఆ కోతితో "ఓ మర్కట రాజమా! అవి మిణుగురు పురుగులు గాని, నిప్పురవ్వలు కావు. వాటితో నువ్వు ఎంత ప్రయత్నించినా నిప్పు ముట్టించలేవు" అని చెప్పింది. ఆ కోతి పైకి చూసి కోపంగా "ఓ చిలుకా, నువ్వు నా అరచెయ్యి అంత లేవు. నువ్వు నాకు సలహా యివ్వటమేమిటి? కట్టిపెట్టు" అని కసిరికొట్టి, మళ్ళీ తన ప్రయత్నంలో మునిగింది. కాసేపు చూసి, మళ్ళీ ఆ చిలుక "చూశావుగా మిత్రమా! నా మాట విని ఆ పురుగులను పట్టుకోవటం మాని నిప్పుకోసం వేరే ప్రయత్నం చెయ్యి" అన్నది. కోతి పట్టరాని కోపంతో "నీ బోడి సలహాలు మానుకుని నోరు మూసుకో, మళ్ళీ నోరెత్తావంటే చంపుతాను జాగ్రత్త" అని హెచ్చరించి మళ్ళీ తన ప్రయత్నం మొదలు పెట్టింది. తోటి జీవులు బాధపడుతుంటే సజ్జనులు చూస్తూ ఊరుకోలేరు. వారికి ఉపశాంతి కలిగించాలని ప్రయత్నిస్తారు. పరోపకార బుద్ధి వాళ్ళ సహజ లక్షణం. ఆ చిలుక మరికొంత సేపు చూసి, ఊరుకోలేక "సోదరా! ఎందుకు యీ వ్యర్థ ప్రయత్నంతో శ్రమ పడతావు? దూరాన ఉన్న పల్లె దగ్గర నిప్పు దొరుకుతుంది వెళ్ళు"అంది. కోతి ఒక్క గంతుతో ఆ చిలుకను పట్టుకొని మెడ విరిచి పారేసింది. సజ్జనుడైనా దుర్జనుడి దగ్గర ఉండటమే ప్రమాదము. ఇక సలహా యివ్వటం మహా ప్రమాదమే.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

ముందు దాసోహం అనేది మనం ఆచరిస్తే, ఆ భావాన్ని మన మనస్సులో ఇనుమడింపచేసుకుంటే అదే, సోహమ్ అనే భావాన్ని ఏర్పరుస్తుంది. సోహమ్ అంటే సఃఅహమ్ - 'వాడే నేను' అంటే ఆ పరమాత్మే 'నేను'గా ప్రకాశిస్తున్నది అన్నది అనుభవ పూర్వకంగా తెలుసుకోవడమే జ్ఞానం. సోహమ్ అనే భావన అలపైకి ఎగరటం లాంటిదన్నమాట. అది జ్ఞాని యొక్క భావన, మాయ మీద పడినప్పుడు, 'ఈ మాయ నన్నేంచేస్తుంది?' అని ధీరత్వంగా దానిపైకి ఎగిరితే, అది మెల్లగా క్రింద నుంచి వెళ్లిపోతుంది. అలాగే సర్వసృష్టి భగవన్మయమే అనే భావన



పెంపొందించుకుంటే, భగవంతునికి దాసోహమ్ అని అనుకుంటే ఈ ప్రపంచ విషయాదులు ఏవీ మనని ఆతృత, ఆవేదన పెట్టవు. ఇలా కాకుండా, ఇవన్నీ మాయ యొక్క స్వభావమే కదా. నా ప్రభువు నాకున్నాడు కనుక నాకు భయమేమిటి? అని అనుకుంటే పైకి వెళ్లిపోతాం. ఇది జ్ఞాని యొక్క లక్షణం. ఈ విధంగా ఏదో ఒక ఉపాయంతో సముద్రంలోపలికి వెళ్తే రత్నాలు, ముత్యాలు దొరుకుతాయిగాని, బయటనే వుండి చూస్తే నురుగు, ఇసుక, నత్తగుల్లలే కనబడతాయి.

ప్రపంచ సంసారమనే సముద్రంలో వుంటూ దానిని దాటడానికి మెలకువలు తెలియక నత్త గుల్లలు ఏరుకుని సంచులలో మూటలు కట్టి, మోసి మోసి, పాపపుణ్యాలనే వాటిని పెంచుకుంటూ, పైగా 'ఇది బరువు, బరువు' అనుకుంటున్నాం. మూటగట్టుకున్న యివన్నీ ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. మనకి పనికి వచ్చేవి ఏమిటి అంటే శమదమాది షట్క సంపత్తి మాత్రమే. ఇంద్రియ నిగ్రహం కలిగి వుంటే ఆ తరువాతవన్నీ దాని వెమ్మటే వస్తాయి.

అందుకే సాధకుడయిన వాడికి మంచి జిజ్ఞాస, ఆవేదన కావాలి. విచ్చల విడిగా పరుగులు పెట్టే మనసుని అదుపులో పెట్టుకోలేని మనని

చూసేనేమో అన్నమాచార్యులవారు ఎంతో ఆవేదనతో ఆ ప్రభువుకి విన్నవించుకున్న ఈ కీర్తనంటే గురుమహరాజ్ వారు ఎంతో ఇష్టంగా విని ఆనందించేవారు - (అని చెప్తూ శ్రీమాతాజీ ఈ కీర్తననాలాపించారు...

హరి నీవే సర్వాత్మకుడవు
స్థిరమగు భావన నీయగదే॥

1) పారకమానదు పాపపు మనసిది
ఈ రసములలో ఎంతైనా (ఎందైనా)
నీరజాక్ష ఇది నీ మహిమేనని - (నీ మయమేనని)
ఈ రీతుల తలపీయగదే॥

2) చూడక మానవు చూచెడి కన్నులు
ఈడనేదైన ఇతరములు
ఈడనన్నింట నీరూపముగన
ఈడులేని తెలివీయగదే॥

3) కలుగక మానవు కాయపు సుఖములు
ఇలలోపల గల వెన్నైనా
అలరిన శ్రీ వేంకటాధిప నీకే
ఇలనర్పితమగు నిజమీయాగదే॥ హరినీవే...

మనం ఎంతో గొప్పవాళ్లమని విర్రవీగుతూ వుంటాము. కానీ, గురుశిక్షణలో, మనసు నేకాగ్రత చేయవలసి వచ్చినపుడు, ఆ మనస్సు ఎలా తైతక్కలాడుతుందో ఏ కవులు వర్ణించగలరు? అందువల్లనే ఎవరివల్లా కాని మనస్సుని మహాత్ములు స్వీకరించి, "నేను చెప్పినట్టు చేస్తే నీ మనస్సు నీమాట వింటుంది. నేను చెప్పినట్టు చేయి. అంతే. ఇక అక్కడ అర్థమో, భావమో, దేనికి సంబంధించినదో, ఆ విషయాలన్నీ నీకు అనవసరం" అని మహాత్ములు మనకి చెప్పినప్పుడు అలానే చేయాలి. గురుదేవులు కొండ ఎక్కమంటే ఎక్కాలి; దూకమంటే దూకాలి; చావమంటే చావాలి. వారేది చెపితే అది చేయాలి. గురువాక్యమే మనకి మహామంత్రం.

గురుదేవుల దగ్గర మాయ, కాలిక్రింద పీఠంలా వుంటుంది. శ్రీస్వామివారు పాదపూజకై సింహాసనం అధిష్ఠించే ముందు, సింహాసనానికి పూజ చేస్తారు. దీనినే 'పీఠపూజ' అంటారు. పీఠపూజ అంతా చేసిన తరువాత,

ఎడమ కాలితో ఆ పీఠాన్ని ఛేదించి (అంటే పీఠంపైన పూలని ఎడమ పాదంతో ప్రక్కకి త్రోసి) సింహాసనాన్ని అధిష్ఠిస్తారు. ఎందుచేత ఈ విధంగా వారాచరిస్తున్నారు? వారు ముందుగా మహత్తరమైనటువంటి మాయా శక్తికి పూజచేసి, 'నా గురుదేవులు నాకిచ్చిన ఆజ్ఞతో నిన్ను అధిష్ఠిస్తున్నాను తల్లీ' అని పూజ చేసిన ఆ పీఠాన్నే అధిష్ఠించి, పూజలందుకుంటున్నారు. గురుపూజలో ఇంతటి విశేష రహస్యం వుంది.

ఈ క్రియ ద్వారా మనకు తెలుస్తున్నదేమిటంటే, దాటశక్యం కాని భగవన్మాయా శక్తిని, ముందు ఎంతో నియమ నిష్ఠలతో పూజించి, దానిని తన వశం చేసుకొని, అటు పిమ్మట దానిని ఛేదించి, అద్వైత సామ్రాజ్య సింహాసనాన్ని మహాత్ములైన సద్గురుదేవులు అధిష్ఠిస్తారు. దీనిలో ఇంతటి లోతైన అర్థం దాగి ఉన్నది. మనం గుర్తిస్తే మహాత్ములు చెప్పిన ప్రతి విషయం, ప్రతి ఒక్క మాట మనకి ఆనందాన్ని, అనుభూతిని ఇస్తూ ఉంటుంది.

అన్నమాచార్యులవారు "పారక మానదు పాపపు మనసిది, ఈ రసములలో ఎందైనా, నీరజాక్ష! ఇది నీ మహిమేనని," అని పాడితే, శ్రీగురుదేవులు "........ఇది నీ మయమేనని" అని కూడా పాడించేవారు. ఇందతా నీ మహిమే అని అనుకోవటం భక్తిమార్గం. 'ఇదంతా నీ మయమే, నీతోనే నిండి యున్నది' అని అనుకోవడం జ్ఞానమార్గం.

ఈ పాపపు మనసు ఈ లోకంలోని అనేక రసాలలో ఎందైనా పారక మానదు. ఆ మనస్సు ఒక్క క్షణమైన ఊరుకుంటుందా? ఈ మాయ మనసు చేసే చిత్కళలు అనేక విధాలుగా ఉంటాయి. ఉదాహరణకి ఒక ఉద్యోగస్థుడి విషయం చూద్దాం. ఎప్పుడు ఆదివారం వస్తుందా, హాయిగా ముసుగు తన్ని 10గంటల వరకూ పడుకోవచ్చు అనుకుంటాడు. డబ్బు సంచులొస్తాయని నెలరోజులూ రెక్కలు ముక్కలు చేసుకుని ఒక్కరోజు కూడా శెలవు తీసుకోకుండా పనిచేస్తాడు. కానీ, అంత డబ్బులొచ్చే ఉద్యోగం కూడా విసుగు తెప్పిస్తుంది. ఎప్పుడెప్పుడు ఆదివారం వస్తుందా, ఎన్ని గంటలైనా ఎవరూ లేపరు కదా! హాయిగా నిద్రపోవచ్చని శనివారం రాత్రి అనుకుంటాడు. కానీ ఉదయం 10గంటలకో, 11గంటలకో నిద్రలేవాల్సిందేగా, నిద్ర ఎక్కువపోతే అది శాశ్వత నిద్రలోకి దింపేయవచ్చు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

ఈరోజు రాత్రి శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఆవరణతో కూడినది జీవాత్మగా వ్యవహరింపబడుతోంది. ఆవరణ తొలగిపోగానే పరమాత్మగా వ్యవహరింపబడుతోంది కదా! ఘటము విచ్ఛిన్నము అయిన తరువాత ఘటాకాశము మహాకాశంలో లీనమైపోతోంది. ఇక్కడ మీకొక దృష్టాంతం చెబుతాను. బియ్యపు గింజని రెండు పొరలు ఆవరించి ఉంటే అది వడ్లగింజ అని పిలువబడుతుంది. బియ్యపు గింజని ఆవరించిన పొరలే అహంకార మమకారాలు. వడ్లగింజకి నూగు అనే సంకల్పాలు లేక కోరికలు ఉంటే దాని చివరి అంకురము ఉంటుంది. అది పునరుత్పత్తికి దారితీస్తుంది. అలాగే మానవుడు అహంకార మమకారములతో, సంకల్పాలతో ఉన్నంత కాలమూ పునర్జన్మ తప్పదు. అహంకార మమకారాలనే పొరలని గురుదేవుడు జ్ఞానాంజనముతో నిర్మూలించ గలుగుతాడు. అవి తొలగిన మరుక్షణం నిన్ను నువ్వు గుర్తించగలుగుతావు. అంటే నీవెవరో తెలిసికోగలుగుతావు. అహంకార మమకారాలనే పొరలే అజ్ఞానము లేక అవిద్య. అజ్ఞానము అనే ఆవరణ ఉన్నంత కాలమూ మానవునికి దేహదృష్టి మాత్రమే ఉంటుంది. ఈ దేహమే నేను అనుకుంటాడు. నేను, నాది అనే అహంకార మమకారములు రెండూ తొలగిపోగానే దేహదృష్టి తొలగిపోతుంది కాబట్టి మనం ప్రేమించ వలసినది భగవంతుణ్ణే దేహాన్ని కాదు. లవ్ గాడ్. భగవంతుడి ప్రేమ సుస్థిరమైనది. నిత్యమైనది, సత్యమైనది అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ మీకొక దృష్టాంతం చెబుతాను. ఇక్కడ మన మధ్యలో కూర్చునియున్న ఈ వ్యక్తి తండ్రి మహాపండితుడు. ఆయన మరణించాడు. మరణం ఎవరికైనా సహజమే కదా! ఘటము విచ్ఛిన్నం కావలసినదే కదా! ఈయన కూడా పండితుడే కదా! అన్ని శాస్త్రాలు తెలిసిన వాడు. మరి ఈయన తండ్రి మరణించినప్పుడు మా నాన్నగారు పోయారు అని ఎంతో దుఃఖించాడు. ఆయన మిత్రులలందరికీ ఎన్నో సంఘటనలు ఎన్నో కథలు కథలుగా చెప్పిమరీ దుఃఖించాడు. మరి నాన్నగారు ఎదురుగానే ఉన్నారు కదా! నాన్నగారు పోయారు అన్నారు కదా! మరి ఎదురుగా ఉన్నది ఎవరు? పోనీ ఇప్పుడు చెప్పండి అని ప్రశ్నించారు.

ఆ వ్యక్తి సమాధానం చెబుతూ అది ప్రేత లేక శవము అని పిలువ బడుతోంది అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ దానికి అన్ని అవయవాలూ ఉన్నాయి కాని అది జడమైనది. దానికి సత్తాలేదు. ఇంద్రియాలకి పనిచేసే శక్తి లేదు. అదే మీరు అర్థం చేసికోవాలి. ఆ దేహానికి ఇంతవరకూ పనిచేసే శక్తిని ఇచ్చినదే ఆత్మవస్తువు. అదే చైతన్యము. దానికి పరిణామం లేదు. అది నిత్యమైనది, సత్యమైనది. ఇప్పుడు చెప్పమనండి ఈ వ్యక్తి దుఃఖించినది తన ఎదురుగా ఉన్న ప్రేతకోసమా? లేక చైతన్యం కోసమా? అలాగే ఇంతకాలం మా నాన్నగారు అని ప్రేమించినది దేనిని? ఎదురుగా ఉన్న శవాన్ని ప్రేమించమంటే ప్రేమించగలుగుతాడా? ఇంకా కొద్దిసేపు ఆ శవాన్ని అక్కడే ఉంచితే భయపడతాడు కూడా! ఇప్పుడు మనం ఈయన్ని ప్రశ్నిస్తే నేను చైతన్యం కోసమే దుఃఖించాను అని పాండిత్యాన్ని ప్రదర్శించవచ్చు. కాని చైతన్యంకోసం దుఃఖించవలసిన పనియేమున్నది? అది లేనిది ఎక్కడ? చైతన్యము నిత్యమైనదేగదా! దానికోసం దుఃఖించడమెందుకు? అని ప్రశ్నించారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ మీకు ఇంకొక విషయాన్ని చెబుతాను. ఒక దేశానికి అధినేత ఉంటాడు. మరి ఆ దేశస్థులందరూ ప్రేమించేది ఆ దేశాధినేత అయిన వ్యక్తినా లేక ఆయన ధరించిన దుస్తులనా? లేక ఆయన కూర్చున్న సింహాసనమా! లేక ఆయన ధరించిన కిరీటాన్నా! సగుణంగా మనకందరికీ కంటికి కనబడే ఈ దేహం ఒక షర్ట్ లాంటిది. మనం ధరించిన షర్ట్ చిరిగిపోయినంత మాత్రాన దాన్ని చూసి దుఃఖించం కదా! ఆ షర్ట్‌ని తీసివేసి ఇంకొక షర్ట్‌ని ధరిస్తాము. కాబట్టి నువ్వు ప్రేమించవలసినది ఈ దేహాన్ని కాదు. దీనికి ఆధారమైన చైతన్యాన్ని లేక ఆత్మవస్తువుని. అక్కడ కూర్చుని ఉన్న పిల్లల్ని చూపిస్తూ మనమంతా వాళ్ళలాగా మారిపోవాలి. పసి హృదయాలు ఎంతో నిర్మలంగా ఉంటాయి. ఈర్ష్య అసూయలకు తావు ఉండదు. మనస్సులో ఏ రకమైన వికారభావాలూ ఉండవు అన్నారు శ్రీబాబు.

**24-5-1985**

శ్రీబాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈనాటి శిష్యులు ఎలా ఉంటున్నారో తెలియజేసే ఉదంతాన్ని చెబుతాను అన్నారు. శ్రీబాబు ఇంకా ఉద్బోధిస్తూ ఒక శిష్యుడు ఎంతో కాలంగా గురువును ఆశ్రయించి ప్రాధేయ పడగా పడగా అనుగ్రహించి లక్ష్యార్థాన్ని ప్రసాదించటానికి నిర్ణయించు

కుంటాడు. ఆచార్యదేవుడు శిష్యుణ్ణి పిలిచి లక్ష్యార్థాన్ని ప్రసాదించమంటున్నావు చాలా జాగ్రత్తగా దానియందు మనస్సు ఉంచి ఎంతో విశ్వాసంతో దానిని ధ్యానించాలి. అలా చేస్తే దాని ద్వారా నువ్వు ఆశించిన ఫలితాన్ని పొంద గలుగుతావు అన్నారు. శిష్యుడు పాపం విన్నాడు. అతనిని తప్పు పట్టనవసరం లేదు. ఏదో విననటువంటిది, లోకంలో లేనిది చెబుతాడు అనుకున్నాడు తన ఆచార్యుడు. ఎంతో ఆత్రుతతో లక్ష్యార్థాన్ని స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నాడు. ఆచార్య దేవుడు వెంటనే శిష్యుడిని దగ్గరగా రమ్మనమని పిలిచి నాయనా! కుడిచెవి ఏది? అన్నారు. శిష్యుడు ఎడమచెవి పెట్టాడు. కుడిచెవి పట్టు నాయనా! అన్నారు ఆచార్యదేవుడు. కుడికి ఎడమకు తేడా ఏమిటి గురువుగారూ? అన్నాడా శిష్యుడు. ఆచార్యుడు వెంటనే కలుగజేసుకుని కుడిచేతితో భోజనం చేస్తావు కదా! ఎడమచేయితో చేస్తావా కుడిచేత్తో చేసే పనులు? ఎడమచేతితో చేయగలవా? అని ప్రశ్నించారు. ప్రాక్టీసు వలన చేయవచ్చు అన్నాడు శిష్యుడు.

ఇన్ని ఆర్గ్యుమెంట్స్ చేసేవాడు లక్ష్యార్థాన్ని గౌరవిస్తాడా? అనుకున్నాడు గురువుగారు. నేను చెప్పేది బాగుగాజీర్ణం చేసుకుంటే కుడి ఎడమ తేడాని మరచి అభేద దృష్టిని కలిగియుంటావు అన్నాడా ఆచార్యదేవుడు. రెండు చెవులలో ఒక చెవి పోతుందాండీ? అని ప్రశ్నిస్తాడు ఆ శిష్యుడు. అది కాదు నాయనా ఈ రెండు చెవులకు శక్తినిచ్చేది ఒక్కటే అని తెలుసుకుంటావు. ఒక్క ప్లగ్‌కి కనెక్షన్ ఇస్తే ఫ్యాన్ తిరగటానికి, లైటు వెలగటానికి శక్తినిస్తుంది అని వివరిస్తాడు. ఇంకా మాట్లాడుతూ నీ దేహంలోని ఇంద్రియాలన్నింటినీ ప్రకాశింపజేసే శక్తి ఒక్కటే. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు అన్నీ కలిసి నీకు మానవ శరీర ఆకారాన్ని ఇచ్చింది. నీ దేహంలోని ఇంద్రియాలన్నీ సక్రమంగా పనిచేయాలంటే శక్తి కావాలి. ఆ శక్తి నీ దేహం లోపలే ఉంది అన్నారు.

శక్తి ఎక్కడ దాగి ఉందండి? అని ప్రశ్నించాడు శిష్యుడు. వెంటనే ఆచార్యదేవుడు ప్రశ్నిస్తూ మీ నాన్నగారూ అమ్మగారూ క్షేమంగా ఉన్నారా బాబూ అన్నారు. శిష్యుడు సమాధానం చెబుతూ వాళ్ళు నా చిన్నతనంలోనే వెళ్ళిపోయారు. నేను ఎంత ఏడ్చినా వాళ్ళిద్దరూ గోవు కట్టు రాయిలా అయిపోయారు. కనురెప్ప కూడా కదల్చలేదండి జనం అంతా వారి దగ్గరకి వెళ్ళటానికి భయపడ్డారు. మా ఆవిడ తాను భయపడటమేకాక నన్ను కూడా మా అమ్మ నాన్నల దగ్గరకి వెళ్ళనివ్వలేదండీ అన్నాడు.

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**మార్చి 2011**

**2 బుధ** మహా శివరాత్రి, తె.ఝా. 3 గం.లకు బృందావనంలో శ్రీ గురుదేవులకు రుద్ర,నమక, చమక సహితంగా అభిషేకము, 4 గం.లకు మహన్యాసము, 5గం.30 నిలకు శ్రీ సద్గురు పాదపూజ, 7గం.30 నిలకు సామూహిక రుద్రాభిషేకములు, 11గం.లకు శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన, రాత్రి 7గం.లకు, శ్రీ కాళికాపరమేశ్వరీ శ్రీరామలింగేశ్వరుల లీలా కళ్యాణము, రాత్రి 9.గం.లకు గం.లకు శ్రీ కాళికాపరమేశ్వరీ శ్రీరామలింగేశ్వరుల నగరోత్సవము

**7 సోమ** శ్రీ లలితానంద సరస్వతి స్వామినివారి చతుర్దశ వార్షికారాధన మహోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం,

**19 శని** పూర్ణిమ, హోలీ పండుగ,శ్రీ సద్గురుపాదపూజ

**28 సోమ** శ్రీ గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

**ఏప్రియల్ 2011**

**1 శుక్ర** మాసశివరాత్రి

**4 సోమ** శ్రీఖర నామ సంవత్సర ఉగాది. 11గంటలకు పంచాంగ శ్రవణం అనంతరం శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

**5 మంగళ - 11 సోమ** వరకు మౌనధ్యాన సప్తాహ శిబిరము. (ఆసక్తిగల భక్తులందరూ పాల్గొనవచ్చు)

**12 మంగళ** శ్రీరామ నవమి. ఉ॥ 5.30ని॥ శ్రీసద్గురుపాదపూజ. 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణం, భక్తసమారాధన.

**18 సోమ** పౌర్ణమి. శ్రీసద్గురుపాదపూజ.

**27 బుధ** శ్రీ గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

**30 శని** శనిత్రయోదశి.

# ఉపాసన అంటే ఏమిటి?

(గత సంచిక తరువాయి) -వెంకట రమణ ప్రసాద్

బ్రహ్మము అమూర్తమూ, సర్వవ్యాపకమూ, ఆత్మరూపమూ అయిన వస్తువు. దీనిని నీవు ఉపాసనా విధానంలో ఎలా భావిస్తావు? బాహ్యముగానైతే ఒక శిలావిగ్రహములోనో, అంతరంగానైతే హృదయకుహరంలోనో నిలుపుకుని చూస్తానంటావు. ఎన్నో ఆలోచనలు, భావాలు మనస్సుకు వస్తుంటే, వాటన్నిటినీ త్రోసిరాజని ఒకే చిత్తవృత్తి దాని మీద ధారావాహికంగా ప్రవహింప జేస్తానంటావు. అలా చేస్తే అది బ్రహ్మమున్నట్లుగా నీవు భావించటం కాదు. నీవు భావించినట్లుగా బ్రహ్మముందనుకొని చేసే ప్రయత్నం. మరి ఇలాంటి ప్రయత్నం వస్తు స్వభావానికవిరోధి ఎలా అవుతుంది? మీదుమిక్కిలి దానికి విరోధి అయి పరిణమిస్తుంది. అనగా జాగ్రత్తగా ఆలోచిస్తే జ్ఞానం ప్రమయైతే, ఉపాసనా లేక ధ్యానమూ భ్రమ అవుతాయి.

అంతమాత్రముచేత, ధ్యానము లేక ఉపాసన నిష్ప్రయోజనము కాదు. సాధకుల స్థాయినిబట్టి వారివారి సంస్కారములను బట్టి నిర్ణయించుకొన వలసినవి విధానములు. చాలామంది సాధకులు ఉపాసనా, ధ్యానముల వలన కృతకృత్యులైనట్లు మనకు శ్రుతి, స్మృతులు సాక్షమిచ్చుచున్నవి.

ఇంతకు జ్ఞాన ఉపాసనకులకున్న భేదము ప్రమాజ్ఞానము, భ్రమాజ్ఞానములకున్న అంతరముపైన అధారపడియున్నట్లు తెలియచుతున్నది. ఈ జ్ఞానముల అంతరముప్రమాణములకు సంబంధించిన యంశమున చర్చింపవలసియున్నను, ప్రస్థుతమునకు సంబంధించినంతవరకు కొలదిగా పరిశీలించ వలసియున్నది.

## ప్రమ - భ్రమ

మనకు కలిగే జ్ఞానాన్ని గమనించిన పెద్దలు జ్ఞానం విభిన్న మార్గాలలో కలుగుతుందని నిర్ణయించారు. మనకు జ్ఞానేంద్రియాలు (చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు) అయిదింటి ద్వారా,

కర్మేంద్రియాలు (వాక్కు, చేతులు, కాళ్ళు, విసర్జనేంద్రియము, ఉపస్థేంద్రియము) అయిదింటి ద్వారాను మనకు బయట ఉన్న వస్తువుల నుంచి సమాచారం అందుతుంది. ఈ అయిదింటినీ దశేంద్రియాలు అంటారు. ఈ దశేంద్రియాల ద్వారా మనం పొందే జ్ఞానాన్ని ప్రత్యక్ష జ్ఞానం అంటారు. అయితే

ఈ జ్ఞానం మనకు బయట ఉన్న వస్తువుల గురించి మాత్రమే తెలుపుతుంది గనుక దీనిని 1.ప్రత్యక్షజ్ఞానం, 2.బాహ్యవస్తు జ్ఞానం అని రెండు పేర్లతో పిలుస్తారు.

ఈ ప్రత్యక్షజ్ఞానం మళ్ళా రెండు విధాలుగా అంటే 1. ప్రమా జ్ఞానం, 2. భ్రమాజ్ఞానము అని ఉంటుంది. ఎందరు ఎన్నిసార్లు చూసినా మారక, ఒకే విధంగా ఉండే జ్ఞానాన్ని ప్రమాజ్ఞానం అంటారు. సముద్రాన్ని ఎన్ని పర్యాయాలు ఎందరు చూసినా దానిని సముద్రమే అంటారు. ప్రమాజ్ఞానం అంటే నిశ్చయమైన జ్ఞానం.

అలాకాక, మార్పుచెందే జ్ఞానాన్ని భ్రమాజ్ఞానం అంటాము. మనం వీధిలో ఒక వ్యక్తిని చూసి, ఫలానా రామయ్య అనుకున్నాము. ఆ వ్యక్తికి రామయ్య పోలికలుండటం వలన దూరం నుంచి చూసిన మనకు అతడు రామయ్యగా కనిపించాడు. కానీ దగ్గరకు వెళ్ళాక అతడు రామయ్య కాదని తెలిసింది. అలా రామయ్యగా అతడు అందరికీ కనిపించడు. కొందరికే కొన్ని సందర్భాలలోనే కనిపిస్తాడు. అలామారే జ్ఞానాన్నే భ్రమాజ్ఞానం అంటాము.

భ్రమాజ్ఞానాన్ని మళ్ళీ రెండు రకాలుగా విశ్లేషించారు శాస్త్రకారులు. ఆ రెండు రకాలకే 1. సంవాది భ్రమ 2. విసంవాది భ్రమ అని పెర్లు పెట్టారు.

ఒక గదికి తలుపులు మూయబడి ఉన్నాయి. కాని ఆతలుపుల మధ్య ఉన్న ఒక సన్నని రంధ్రములో నుండి దీపపు కాంతి బయటకు ప్రసరిస్తున్నది. అది చూచుటకు రత్నపుకాంతిలా ఉన్నది. ఒకానొకడు ఆ కాంతిని చూసి రత్నమని దగ్గరకు వచ్చి, చూచి రత్నము కాదని తెలుసుకుని వెళ్ళిపోయాడు. దీనిని విసంవాది భ్రమ అన్నారు శాస్త్రకారులు.

మొదటి ఇంటిలో వలెనే మరియొక యింటిలో తలుపులు మూయబడిన గదిలో నుండి వచ్చుచున్న కాంతిని చూసి మణియని భావించి మరియొకడు వచ్చిచూచి, దానిని నిజమైన మణికాంతియే అని తెలుసుకుని, తలుపులు తెరచి లోనికేగి మణిని తీసుకుని వెళ్ళిపోయెను. శాస్త్రకారులు దీనిని సంవాది భ్రమ యందురు.

భ్రమ వలన ఎక్కడ ఏ ప్రయోజనమును సిద్ధించిక , కేవలము ప్రయాసమాత్రమే మిగిలినదో దానిని విసంవాది భ్రమ యనియు, భ్రమ వలననే ప్రయత్నము ప్రారంభమైనను ఎచ్చట ప్రయోజము సిద్ధించెనో దానిని సంవాది భ్రమ యనియు శాస్త్రకారులు పిల్చుచున్నారు. పంచదశీకారులు సంవాది భ్రమకు మరికొన్ని యుదాహరణలిచ్చియున్నారు.

**బాష్పం ధూమతయా బుధ్వా తత్రాంగారానుమానతః**
**వహ్నిర్యదృచ్ఛయాలబ్ధః స సంవాది భ్రమోమతః**

**(9-7)**

ఒకడు మంచునుచూచి పొగయని భ్రమించి, అచ్చట అగ్నియుండునని యనుమానించి, యాదృచ్ఛికముగా అగ్నిని సంపాదించినచో అది సంవాది భ్రమ యగును.

**గోదావర్యుదకం గంగోదకం మత్వావిశుద్ధయే**
**సంప్రోక్ష్య శుద్ధి మాప్నోతి, స సంవాది భ్రమోమతః (9-8)**

ఒకడు గోదావరీ జలమును గంగాజలమని భ్రమించి, శుద్ధినాశించి, సంప్రోక్షణచేసుకొని, శుద్ధి పొందినచో నది సంవాదిభ్రమ యగును. అట్లే సన్నిపాత జ్వరముచే పలవరించుచు నొకడు నారాయణ స్మరణము చేసి మరణించి స్వర్గమును పొందినచో నది సంవాది భ్రమ యగును. (9-9). కనుక అనుమాన (మంచు - అగ్ని) శబ్ద, ఆగమ (గోదావరిజల సంప్రోక్షణం, నారాయణ స్మరణం) ప్రమాణములందు సంవాది భ్రమలు కోట్లకొలది గలవు.

ఏ విధంగా సంవాదిభ్రమ ఫలప్రదమౌతుందో, ఆవిధంగానే ఉపాసన వలన బ్రహ్మ సాక్షాత్కారమౌతుందని శాస్త్ర నిర్ణయిము. ఈ విషయమున పంచదశీకారులు తమ నిర్ణయమును కడు స్పష్టముగ వ్యక్తముజేసిరి.

**స్వయంభ్రమోపి సంవాదీ యధా సమ్యక్ఫలప్రదః**
**బ్రహ్మతత్వోపాసనాపి తథా ముక్తి ఫలప్రదాః ॥ (9-13)**

స్వతహా భ్రమయేయైనా, సంవాది భ్రమ ఫలాన్ని చేకూర్చినట్లే ,బ్రహ్మతత్వోపాసన కూడ ఫలప్రదమే అవుతుందన్నారు విద్యారణ్యులు. అందువల్ల వస్తుతంత్రంకాని బుద్ధితంత్రవే అయినా, ఉపాసన సత్ఫలితాన్నిస్తుందని శాస్త్రనిర్ణయం. *

# సాధనోపదేశ చతుష్టయము

- సుషుమ్నా ప్రసాద

అందుచేతనే Long fellow అనే ఆంగ్లకవి జీవితమును సమరముతో పోల్చాడు. In the word's broad field of battle, in the bivouac of life.do not be like dviven cattle.Be a dumb hero in the strife అంటే ఈ విశాల ప్రపంచమనే యుద్ధభూమిలో తాత్కాలికమైన డేరా వంటి ఈ జీవితంలో నోరులేని మూగజీవులు గొఱ్ఱెలవలె ఎటుతోలితే అటుపోక వీరులవలె సమరాన్ని కొనసాగించాలి అని అర్థము.

ప్రతి వ్యక్తిలో అజ్ఞాతమైన శక్తి ఉన్నది. నిద్రాణమైన ఆ శక్తిని గురుదేవుడు మేల్కొలిపి, తన్ను తాను గ్రహించేటట్లు చేస్తాడు. విషాదములో మునిగి నిరాశ, నిస్పృహలకు లోనైన అర్జునుని కృష్ణభగవానుడు భగవద్గీత సాంఖ్యయోగములో అలాగే మేల్కొన్నాడు.

**క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వయ్యుప పద్యతే।**
**క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥**

(భవగద్గీత 2అ. - 3శ్లో)

భయమును పిరికితనమును విడనాడి, తుచ్ఛమైన హృదయ దౌర్బల్యమునకు వీడ్కోలు చెప్పియుద్ధమునకు వీరునివలె పురోగించమని, పార్థుని కృష్ణపరమాత్మ ప్రోత్సహించాడు. అలా మాయాజనితమైన మోహమనే శత్రువుతో ధైర్యంగా పోరాడాలి. విశ్వాసమనే కవచమును ధరిస్తే తప్పకుండా విజయం లభిస్తుంది.

తరువాత ఈ పోరాటాన్ని చివరిదాకా కొనసాగించాలి fight to the end మధ్యలో వదిలివేయకూడదు. మానవులలో మూడు రకాలమనస్తత్వం గలవారున్నారు.

కొందరు సత్కార్యమును ప్రారంభించనే ప్రారంభించరు. వారు అధములు. మరికొంతమంది సత్కార్యమును ఉత్సాహముతో ప్రారంభిస్తారు. కాని చివరిదాకా కొనసాగించక మధ్యలోనే వదిలివేస్తారు వీరు మధ్యములు. కాని అతికొద్దిమంది ధీరులు ప్రారంభించిన సత్కార్యమునకెట్టి అడ్డంకులు వచ్చినా ధైర్యమును విడనాడక, చివరిదాకా ప్రయత్నము కొనసాగించి, విజయమును సాధిస్తారు వారు ఉత్తములు.

సాధకుడు ఉత్తముని పంథాని అవలంబించి, తన ధ్యేయమును చేరుకొనేదాకా ప్రయత్నము కొనసాగించాలి. ఎందుకంటె మాయ మహాజిత్తులమారి. ఇంద్రధనస్సు వలె ఆకర్షించే విషయాకర్షణలన్నిటినీ మనముందుంచి ప్రలోభపరచటానికి ప్రయత్నిస్తుంది. ఆ మాయను జయించాలంటే సద్గురునామ ధ్యానము, సద్గురుసేవ, గురువాజ్ఞాపాలన అనే ఆయుధములను ధరించాలి.

సాధకుడెప్పుడూ నిరంతరము జాగరూకుడై ఉండాలి. మాయ ఏ మూలనో విషసర్పము వలె పొంచి ఉండి, కాటువేయటానికి సిద్ధంగా ఉంటుంది. ఆ విషమునకు విరుగుడు విశ్వేశ్వరుని దివ్యనామ స్మరణ. చివరిశ్వాస వరకు అప్రమత్తంగానే ఉండాలి.

నేను మాయను జయించానని ఎవరూ ధీమాగా చెప్పటానికి వీలులేదు. వినమ్రతతో ఉండటం గొప్పసాధన. వినయవిధేయతలనేవి సాధకునకు సహజభూషణములుగా ఉండాలి. చూడండి గడ్డిపోచను ఉదాహరణకు తీసుకోవచ్చు. మనము దానిని కాలిక్రింద అణగదొక్కితే, తలవంచి, మరల నిలబడుతుంది. ఫలవృక్షం మీద రాళ్ళు వేస్తే, వృక్షము ఫలములనిచ్చి ఆకలిని తీరుస్తుందిగాని, మనమీద కక్షతీర్చుకోదు. ఆత్మాన్వేషి కూడ అలా అహంకార రహితుడై ఉండాలి. గురుమాధవ సేవతో సంపూర్తిగా లీనమైనవాడి మాయను విసర్జించగలడు. నిరంతర గురుస్మరణతో చివరి క్షణం దాకా పోరాటం కొనసాగిస్తూనే ఉండాలి.

అలా సదాజాగరూకుడై ఉన్నవాడే బ్రహ్మజ్ఞాని. నిత్యజాగరూకుడై ఉన్నవాడే జగత్క్రీడ లేక జగన్నాటకమున విజయభేరి మ్రోగించి, తెరవేయ గలడు. జగత్క్రీడలో పాల్గొనే ఈ క్రీడాకారుడు మాయ అనే తన బంతినితన గుప్పెటలో బిగించి, బంతిని తాను ఆడించాలి కాని బంతి చెప్పినట్లు తాను ఆడకూడదు.

సద్గురు మార్గాన్ని అవలంబించినవాడే మాయ అనే బంతిని తన అధీనంలో ఉంచుకొని, జగత్క్రీడను విజయవంతంగా ముగిస్తాడు. *

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గత సంచిక తరువాయి) - సుశీలా ప్రసాద

నీలి మనస్సులో అదే చింతన. దాన్నింకా పెంచుతూ వచ్చిన మరికొన్ని సంఘటనలు. జాజిపందిరి మీద పూలు కోస్తుంటే, విచ్చిన పూలలో పకపక నవ్వుతూ బాలకృష్ణుడు! కృష్ణుడు అడవులకి గోవులతో వెళ్ళిపోయిన తరువాత, నీలి పొగడ చెట్టు నీడన కూచుంటే, చెట్టు వెనకనించి, ముసిముసి నవ్వులతో తొంగిచూస్తూ, దాగుడు మూతలాడుతూ కవ్విస్తూ... ఇదంతా నీలికి పరమ ఆనందదాయకంగానూ ఉంది, అయోమయంగానూ ఉంది.

పొద్దుగూకిన తరువాత సందెదీపాలు వెలిగిస్తూ ఉంటే ఒక జ్యోతినించి ఇంకా కొన్ని జ్యోతులు అలాగలాగ అన్ని జ్యోతులూ ఏకమై గొప్ప వెలుగు! కళ్ళనిండా కాంతులు నిండిపోయి, అందులో తేజోరూపుడైన గోపాలబాలుడు! అనుక్షణం నీలికిదంతా మాయా! కలా! నిజమైతే ఇదంతా చేస్తున్నవాడెవరు? అనే ప్రశ్నలకి సమాధానం వెదుక్కుంటే దొరకటం లేదు.

అప్పుడే తూర్పున చంద్రబింబం ఉదయిస్తోంది కడవ తీసుకుని నీలి యమునా నదికి నీళ్ళకి వెడుతోంది. దగ్గరలోనే తీయని పిల్లనగ్రోవి పాట వినవచ్చింది. అందాలకే అందమైన ముఖకమలంతో విశాలమైన కళ్ళు తలమీద నెమలి ఫించం చుట్టూ మరకతమాల, నుదుట కస్తూరిబొట్టు, ఎర్రని పెదవులపై అమృతం కురిపిస్తున్న మురళి. మునుపు తనలో అలజడి రేపిన అన్ని ఊహాలకీ తృప్తిగా తనివి తీరిన నీలి ప్రతిమలా నిలచింది బాలుని చూస్తు.

"నీలి! నా లీలలన్నీ వింటూ, కంటూ నిరంతరం నాగురించే ఆలోచిస్తున్నావు కదూ! నేనేవరినో తెలుసుకోవాలనే ఆవేదన నీ మనస్సునిండి ఉందికదూ! అన్ని చోట్లా నీకు కనిపిస్తున్నది నందుకుమారుడేనా! యశోదా తనయుడేనా! అయితే సామాన్యమానవ బాలుని కిదెలా సాధ్యమని క్షణం క్షణం నువ్వు తర్కించుకుంటున్నావు గదూ! నీలి తన మదిలో భావాలకి అద్దం పడుతున్నట్టు చెప్తున్న గోపాలకృష్ణుని ఆశ్చర్యంగా చూస్తు ఔనన్నట్టు తల ఊపింది.

"నువ్వు నీళ్ళలో మునిగిపోకుండా బైటకి తీసి బ్రతికించాను. నువ్వొక గొప్ప సత్యాన్ని గుర్తించి అనుభవంగా తెలుసుకోవడానికే సుమా! ఆ పూర్వ

జన్మ సంస్కారం నీకుందని నాకు తెలుసు. ఇప్పుడు చూడు! అన్నిటిలో నిండి ఉన్న చైతన్యాన్ని నేనేనని, కనిపించే ప్రతివస్తువులో ఉన్నది నేనేనని, ఆఖరికి నీలో కూడా నేనే ఉన్నానని గ్రహించు.'' కృష్ణుడి మాటలు వింటూ నీలి అన్ని వైపులా చూసింది.

ఆమె కళ్ళు చూసినంత మేరా అన్నిటిలో, చివరికి తనలో కూడా నందబాలుడే నిండి ఉండటం గమనించింది. "అసలు ఏక రూపుడను నేను. నాలోనించే ఈ కనబడేదంతా వచ్చింది, ఉంటోంది, కడకి నాలో లయమైపోతుంది. విశ్వరూపుడైన అంతటా వ్యాపించి ఉన్నది నేనే.'' నీలి తన్మయత్వంతో వింటున్నది. ఆమె మనస్సు తెరుచుకుని అంతా అర్థమవుతోంది.

"ఇంకా విను. నీకు ఏం కావాలో ఏం కోరుకోవాలో తెలియదు కనుకనే నీకై నువ్వడగకుండానే సమస్తం ఇస్తున్నాను. ఇకపైన నా మాయ నిన్నంటదు. నీకింత ఆత్మతత్త్వాన్ని అనుభవంగా బోధించిన పరమ గురువుగా నన్ను విశ్వసించు. నేను కొద్ది కాలంలోనే మధురా నగరానికి తరలిపోవలసి ఉంది. అప్పుడు నా ఈ రూపం నీకు కనుపమరుగు కావచ్చు. సర్వాంతర్యామిగా నన్ను దర్శిస్తూ నీ శేష జీవితాన్ని జ్ఞానివై కొనసాగించు. ఆపైన నా పదాన్ని పొందగలవు.''

పరమాత్మ అధరాలనుండి వెలువడే దివ్య వాణిని మహా ప్రసాదంగా స్వీకరించి నీలి తలవంచి చేతులు జోడించింది. స్వామి దివ్య సందేశాలను వేణువు విశ్వమంతా వెదజల్లుతోంది. ఆ గురుశిష్యుల అనుబంధానికి పంచభూతాలు సాక్షులుగా నిలిచాయి.

సహజ సౌందర్య విలసితమైన ముఖకమలం, పిల్లనగ్రోవి మధురనాదాలను అనుభవిస్తుంటే లోకాలను చల్లగా చూసే దివ్య ప్రకాశ స్వరూపుడైన వాని ఎర్రని పాదకమలాల యందలి భక్తిరసంతో తడిసిన నా చిత్తం ఎల్లెడలా నిండిన వానితో క్రీడించుగాక!!

# బెంగుళూరులో శ్రీ మాతాజీ

-పరాశర ప్రసాద్

శ్రీ యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ భక్తులకు బోధ చేస్తూ "ప్రపంచంలో అన్నిటి కన్న గొప్పది భగవంతుని దివ్య చరణారవిందము. ఆయనే దాత అందువలననే ఆయన సద్గురుమూర్తిగా అవతరించి మన జీవిత గమ్యస్థానాన్ని గుర్తింపజేసే పెన్నిధి. ఆయన సన్నిధిని వదిలి ఎవరిని యాచిస్తే మాత్రం మనం గమ్యాన్ని చేరగలమా! అంత్యకాలంలో ఆయన తప్ప ఎవరిని స్మరిస్తావు? అటువంటి అభయం ఇవ్వగల దాత ఎవరైనా ఈ జగత్తులో ఉన్నారా?

అంత్యకాలంలో దేహత్యాగం చేసేటప్పుడు గురుస్మరణ విస్మరించని సాధకుడెవరైనా దైవంగా భావిస్తారు కదా! ఇదంతా మనకి అనుభవమే కదా! భగవానుని నమ్ముకుని, భగవన్నామ స్మరణ మరువని భక్తునికి వార్ధక్యంలోనైనా లోటు ఉంటుందా? సూరదాసు వార్థక్యంలో అనుక్షణం కృష్ణనామాన్ని స్మరించి బాలకృష్ణుని సేవ పొందలేదా! భగవంతుని సేవకన్న భక్తుని సేవించి తరించటం సులభం అన్న మహాత్ముల బోధ నిజం కాదా!

నువ్వు తిన్నది నీకు అక్కరకు రాకపోవచ్చు. కాని ఇతరులకు పెట్టింది నీ ఎక్కౌంటులో జమ అవుతుంది. ఉన్న దానితో సంతృప్తి చెందినవాడికి ఉన్న ఆనందం ఎవరికి ఉంటుంది? యాచించి ఎంతైనా ధనాన్ని సంపాదించవచ్చు. అది నీ జీవిత గమ్య స్థానానికి చేర్చగల్గుతుందా! నీకు కావలసినదాన్ని అందించి మనస్సుకి శాంతిని చేకూర్చ గల్గినది ఎవరు? ఎవరి వలన సృష్టి వస్తుందో, ఎవరి వలన ప్రకాశిస్తుందో, ఎవరి వలన లయమవుతుందో, ఎవరు సర్వము తానే అయినవారో తెలుసుకో ఆయనే ఆత్మ స్వరూపము మూలకారణాన్ని గుర్తిస్తేనే మంచికాని, చెడుకాని తెలుసుకోగలుగుతావు. నీ మనస్సులో ఉన్న రణాన్ని గుర్తించి దానిని నిర్మూలించ గలిగినవాడు గురుదేవుడొక్కడే.

భగవానుడు మనల్ని సృష్టించి మనతోపాటు ఎన్నో వస్తువులను ఆకర్షవంతమైన వాటిని సృష్టించాడు. మానవుడు జన్మాంతర వాసనలచేత, ఆశచేత, బంధనలో పడి తనని సృష్టించిన వాడిని మరచి, ఆకర్షవంతమైన ప్రాపంచిక విషయాదుల వెంట పడుతున్నాడు.

ఒక మహారాజు తన ఆస్థానంలో ఉన్న విలువైన వస్తువులన్నిటినీ ఒక ప్రదర్శనశాలలో ఉంచి, ప్రజలందరిని పిలిచి వారు కోరుకున్న ఏదైన ఒక వస్తువుని మాత్రం తీసుకువెళ్ళమని ఆదేశించారు. అంతా వస్తున్నారు ఎవరికి కావలసిన వస్తువుని వారు తీసుకెళ్తున్నారు. మహారాజుగారు కూడా ప్రదర్శనశాలలో బయటకి వెళ్ళే ద్వారం వద్ద కూర్చుని అందరినీ గమనిస్తున్నారు. ఒక బాలిక ప్రదర్శన శాలలో అన్ని వస్తువులను చూసి ఏ ఒక్క వస్తువూ తీసుకోకుండా బయటకి వెళ్ళే ద్వారం దగ్గరకి వచ్చింది. మహరాజుగారు గమనించారు. ఆ బాలికని ప్రశ్నించారు "ఏ అమ్మా! నీకు ఈ ప్రదర్శనలో ఏ వస్తువూ నచ్చలేదా? ఏమీ తీసుకోకుండా వచ్చావు?'' అన్నారు. ఆ బాలిక సమాధానం చెపుతూ "మహారాజా! ఈ ప్రదర్శనశాలలో ఉన్న వస్తువులన్నీ ఎవరివి? మీవే కదా! అందువలన మీరు కూడా ఈ ప్రదర్శన శాలలోనే ఉన్నారు కదా! కాబట్టి నేను మిమ్మల్నే తీసుకుంటున్నాను'' అని ఆయన చెయ్యి పట్టుకుంది. మహారాజు ఆ బాలిక తెలివికి ఆశ్చర్యపోయారు.

అందువలన సర్వజగత్తును సృష్టించి, అందరికి అన్నింటిని సమకూర్చే భగవంతుణ్ణి విస్మరించి ప్రాపంచిక విషయాదులను కోరుకోవటం వివేకం అనిపించుకుంటుందా? ప్రాపంచిక రసాలన్నీ యిచ్చేది నీరసమే.

రామరసము, కృష్ణరసము నీలోని నీరసాన్ని హరించి, ఆనందము, అనుభూతి నీ సొత్తు అవుతుంది. భక్తుడు తాను పొందిన ఏ అనుభూతినైనా భగవంతుని మహిమగా స్వీకరిస్తాడు. జ్ఞానము పొందినవాడు అంతా నీ మాయే అంటాడు. ఎన్ని సంఘటనలు ఎదురైనా నీ భావనలో మార్పు ఉండకూడదు. స్థిరముగా ఉండాలి. సముద్రంలో ఒక బొమ్మరాయి వేస్తే ఎంత కాలమైనా అది మారదుకదా! ప్రపంచంలో ఎన్ని ఆకర్షణల మధ్య ఉన్న మారనివాడు భక్తుడు. నీ దేహ సుఖము కోసము వ్యసనాలకు బానిస అయినవాడు ఎలా భక్తుడు అనిపించుకుంటాడు.

ప్రక్కతోడుగా భగవానుడు చక్రధారియై మన చెంతనే ఉన్నాడు అనే భావన కలిగిన భక్తుడు ఎన్నడూ భయపడడు. సృష్టిలో ఉన్న ప్రతివారూ ఆహార సముపార్జనకు కర్మ ఆచరించవలసినదే. జీవించటానికి ఆహారం తీసుకోక తప్పదు. నీ జీవిత గమ్యం తెలుసుకునేందుకు జీవించక తప్పదు కదా! నీ గమ్యం ఏమిటో తెలుసుకోవాలంటే నీకు తత్పరత, జిజ్ఞాస ఉండాలికదా!'' అన్నారు మాతాజీ. *

# శ్రీ బాబూజీ దివ్యవాణి

(శంకర జయంతి సందర్భంగా నంబూరు ఆశ్రమంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాదబాబు చేసిన ప్రసంగాన్ని సంగ్రహంగా ఈ దిగువన ప్రచురిస్తున్నాం.)

అది కాశీలో గంగానదీ తీరం. అప్పుడే స్నానాదులు ముగించుకుని విశాల ఫాలభాగాన మెరిసే విభూతి రేఖలతో, త్రినేత్రం వలె భాసించే కుంకుబొట్టుతో, విశాల వక్షాన్ని అలంకరించిన రుద్రాక్షమాలలతో, చేతనున్న దండము త్రిశూలమువలె భాసిస్తుండగా, ప్రమధగణాలవలె శిష్యగణాలు అప్రమత్తులై చుట్టూ కాపలా కాస్తుండగా, పరమ శివునివలె పద్మాసనస్థుడై అనుష్ఠానమగ్నుడై ఉన్నాడొక అసమాన తేజోరాశి.

కల్లుకుండ ఒక భుజాన పెట్టుకుని, మరొక భుజాన కంబళీ వేసుకుని, దున్నపోతు చర్మం కప్పుకుని, మాంస ఖండాలను తాను నమలటమేగాక వెంట వచ్చే కుక్కలకు కూడా అందిస్తూ, కారుమబ్బువంటి మేనితో, కణకణలాడే కళ్ళతో తూలుకుంటూ, ముసిరే ఈగలను తోలుకుంటూ అటువైపుగా వస్తున్నాడొక చండాలుడు. అది గమనించిన ఆచార్యుడు ముఖం చిట్లించి శిష్యుల వంక చూశాడు. వెంటనే శిష్యవర్గం "అపచారం, అపచారం" అంటూ పరుగెత్తి వెళ్ళి "తొలగవయ్యా! దూరంగా తొలగిపో! ఇక్కడ ఆచార్యులవారు అనుష్ఠానంలో ఉన్నారు" అని చండాలుడిని అదిలించారు.

ఆగాడు చండాలుడు. వంగి వంగి దణ్ణాలు పెడుతూ "అయ్యా! అలాగే, అలాగే! కాని తప్పుకోవలసింది, మట్టి మట్టిలోను, గాలి గాలిలోనూ కలిసిపోయే ఈ తోలు శరీరమో, లేక దీనిలోనే ఉంటూ, ఈ బొమ్మను ఆడిస్తూ కదలకుండా మెదలకుండా లోపల, వెలుపల ఉండే ఆత్మవస్తువో తెలియడం లేదు. అయ్యా! వారిని అడిగి చెప్పండి బాబూ!" అన్నాడు. శిష్యులు ఆచార్యులవారితో ఈ విషయం మనవి చేశారు.

ప్రశ్న విన్న ఆచార్యులవారికి ముందు ఆశ్చర్యం, తరువాత ఆనందం ముప్పిరిగొన్నాయి. 'చండాలుడా ఈ ప్రశ్న వేసింది? కాదు. అతడు పంచభూతాలకు ప్రభువైన పరమేశ్వరుడే! నాలో ఏ కోశానో మిగిలి ఉన్న స్వజాతి విజాతి భేదాన్ని రహితం చేసి, నాకు ఈ విధంగా జ్ఞానోదయం కలిగించిన

మహాత్ముడు చండాలుడైతే నేమి? బ్రాహ్మణుడైతేనేమి? అతనే నా గురుదేవుడు. **"చండాలోఽస్తు సతుద్విజోఽస్తు గురు రిత్యేషా మనీషా మమ"** అని అంటూ వెళ్ళి ఆ చండాలుని పాదాలపై సాష్టాంగంగా ప్రణమిల్లాడు. చండాలుని స్థానంలో సదాశివుడే ప్రత్యక్షమైనాడు. దయామృతాన్ని వర్షిస్తూ చిరునవ్వుల వెన్నెలలు కురిపిస్తూ, "నాయనా! అన్ని విధాలా పరిపూర్ణుడవైన నీలో లేశమాత్రంగా మిగిలి ఉన్న ఈ భేదదృష్టిని తొలగించడానికై నేనీ పాత్ర ధరించవలసి వచ్చింది. ఆ దోషం కూడా రహితమైనది కనుక, నీవిప్పుడు జగద్గురు స్థానాన్ని అలంకరించి సర్వమానవాళికి జ్ఞానోపదేశం చేసి, అద్వైత సిద్ధాంతాన్ని స్థాపించు" అని ఆశీర్వదించాడు.

ఆ ఆచార్యులే జగద్గురు శ్రీ శంకర భగవత్పాదాచార్య స్వాములవారు. పై సంఘటన జరిగినప్పుడే మనీషా పంచకమనే పేరుతో ప్రసిద్ధి కెక్కిన అయిదు శ్లోకాలు **"చండాలోఽస్తు సతుద్విజోఽస్తు గురురిత్యేషా మనీషా మమ"** అనే మకుటంతో అశువుగా రచించి, తమకు కలిగిన జ్ఞానోదయాన్ని తెలుపుకున్నారు. జాగ్రత, స్వప్నము, సుషుప్తి అనే మూడు అవస్థలలోనూ సాక్షిగా ఉంటూ పిపీలికాది బ్రహ్మ పర్యంతం వ్యాపించి ఉన్న ప్రజ్ఞాన పరబ్రహ్మమే తానని, తన కంటికి కనిపిస్తూ పరిణామశీలమై ఉన్న ఈ దేహేంద్రియాదులు, మనోబుద్ధ్యాదులు, జగత్తులూ ఇవేవీ తాను కాదనే దృఢ ప్రజ్ఞ కలవాడు చండాలుడైనా, బ్రాహ్మణుడైనా అతడే నా గురువని చాటి చెప్పిన మహా మనీషి ఆయన. ఆయన రచించిన అద్వైత గ్రంథాలలో మణిపూస వంటిది వివేక చూడామణి. అందులో **"జాతి నీతి కుల గోత్ర దూరగం! నామ రూప గుణదోష వర్జితం! దేశ కాల విషయాతి వర్తియత్ బ్రహ్మ, తత్త్వమసి భావయాత్మని"** అన్న శ్లోకం ఈ సందర్భంలో గుర్తు చేసుకో దగినది. *

## చందాదారులకు మనవి

మీకు సమర్థసద్గురు మాసపత్రిక ప్రతినెల పంపుతున్నాము. మీ అడ్రస్సు ప్రక్కన మీ సభ్యత్వం నెంబరు మరియు ఎంతవరకు ఉన్నది తెలియజేస్తున్నాము. దానిని గమనించి మీరు చందా చెల్లించి కంటిన్యూ చేసుకోగలరు.

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

గుంటూరులో అన్నా కోటిలింగంగారు పెద్ద వ్యాపారస్థులు. వారొకసారి మంగళగిరిలో ఉన్న తమ మిత్రుని యింటికి వెళ్ళారు. అప్పుడు వారింట్లో, లేత వయస్సులో ఉన్న బాల సాధువు ఒకాయన ఉన్నారు. కోటిలింగం గారికి వారి మిత్రుడు ఆ సాధువును పరిచయం చేస్తూ "వీరు శ్రీబాబుగారు. అమేయ శక్తి సంపన్నులైన మహాత్ములు. శ్రీ కాళీమాత పరమభక్తులు. నేను వ్యాపార నిమిత్తం కలకత్తా వెళ్ళినప్పుడు వీరి పరిచయ భాగ్యం కలిగింది. నా భార్య ఎంతోకాలం నుండి గ్రహబాధా పీడితురాలై ఉంది. ఎన్ని వైద్యాలు చేయించినా ప్రయోజనం లేకపోయింది. నేను వారితో నా సమస్యను విన్నవించుకొనగా దయతో



వారు మా యింటికి వచ్చి ఆ బాధను పూర్తిగా నివారణ చేశారు. వారి ఋణమును మేము ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేము" అన్నారు. కోటిలింగం గారు శ్రీ బాబుకు నమస్కరించారు. శ్రీ బాబు "జగన్మాత మిమ్ము సర్వదా కాపాడుగాక!" అని ఆశీర్వదించారు.

కోటిలింగంగారు వారిని దర్శించేసరికి, బాలుని వలె కనిపిస్తున్న ఆ మహాత్ముని ముఖారవిందము ఎంతో ప్రసన్నంగాను, తేజోమయంగాను కనిపించింది. దివ్యత్వము ఉట్టిపడుతున్న ఆ మహాత్ముని గురించి తన మిత్రులు చెప్పిన విషయమంతా విన్నపుడు, కోటిలింగంగారికి తమ గృహ సమస్యలూ, వ్యాపార సమస్యలూ గుర్తుకు వచ్చాయి. ఈ మహానుభావుని తమ యింటికి తీసుకుని వెళ్ళి వారి అనుగ్రహంతో ఎంతో లబ్ధిని పొందవచ్చునని గ్రహించి, కోటిలింగంగారు ఆ మహాత్ముని ప్రార్థించి తమతో గుంటూరు తీసుకొని వెళ్ళారు. ఆవిధంగా శ్రీబాబు మొదటిసారి గుంటూరు రావటం జరిగింది.

కోటిలింగంగారికి శ్రీబాబు దయవల్ల గృహసమస్యలు తీరాయి. వారితో శ్రీబాబు ట్రంకు పెట్టెల వ్యాపారం పెట్టించారు. "శ్రీకాళీ ట్రంకు ఫ్యాక్టరీ"

అనే పేరుతో ట్రంకు పెట్టెల తయారీ కూడా ప్రారంభింపజేశారు. కోటిలింగం గారు మంచి లాభాలు గడించి, బాగా ధనవంతులైనారు.

ఆయనకు మద్రాసు గుర్రప్పందెములకు వెళ్ళే అలవాటు ఉండేది. వెళ్ళే ముందు శ్రీబాబుకు కొన్నినెంబర్లు యిచ్చి , అందులో ఏ నెంబరు అదృష్ట సంఖ్యో చెప్పమనేవారు. అవి పందెపు గుర్రాల నెంబర్లని ఊహించని శ్రీబాబు ఏదో నెంబరు చెప్పేవారు. కోటిలింగంగారు మద్రాసు వెళ్ళి , ఆ నెంబరు గల గుర్రంపై పందెం పెట్టి పెద్ద మొత్తాలు గెలుచుకొనేవారు.

ఒకసారి ఏదో పని మీద కోటిలింగంగారు శ్రీబాబును మద్రాసు తీసుకు వెళ్ళారు. అక్కడ గుర్రపు పందెములు చూద్దాము రమ్మన్నారు. గుర్రపు పరుగు పందెములు కదా చూద్దామని శ్రీ బాబు వెళ్ళారు. తీరా అక్కడికి వెళ్ళి చూశాక అది ఎంతటి మహా వ్యసనమో, ఎలా లక్షాధికారులను భిక్షాధికారులుగా మార్చగలదో, ఎన్ని సంసారాలను కూల్చగలదో గ్రహించి కోటిలింగంగారితో "ఇక ఎన్నడూ నన్ను ఇటువంటి చోటుకు తీసుకు రావద్దు. అంతేకాదు; బాగుపడదలచుకుంటే మీరు కూడా ఇప్పటి నుంచి ఈ అలవాటు మానుకోవాలి. మీ కుటుంబం మేలూ, మీ మేలూ కోరి నేనీ మాట చెబుతున్నాను. మీరీ దురలవాటు మానుకోకపోతే, నేను మీ యింటికి రాను'' అని హెచ్చరించారు.

కోటిలింగంగారి కొట్లో తూనుగుంట్ల శేషగిరిరావుగారు గుమాస్తాగా పని చేస్తూ ఉండేవారు. వారి అన్నగారు వీరరాఘవయ్యగారు. వీరరాఘవయ్యగారి కుటుంబమూ, వారి బావగారైన మాజేటి పున్నయ్యగారి కుటుంబమూ కలిసి గుంటూరులోని ఆనంద తీర్థ అగ్రహారంలో ఉండేవారు. పున్నయ్యగారి కుమారుడు గోపాల శ్రీశైలరావు ఏడాది వయస్సు కలవాడు. అతనికి కాళ్ళు చేతులు చచ్చు పడిపోయాయి. తల చాలా చిన్న సైజులో ఉంది. డాక్టర్లు పోలియో అన్నారు. ఎవరితో వైద్యం చేయించినా లాభం లేకపోయింది. ఆ పరిస్థితులలో తూనుగుంట్ల శేషగిరిరావుగారి ద్వారా శ్రీబాబు విషయం పున్నయ్యగారికి తెలిసింది.

పున్నయ్యగారు వెంటనే శ్రీబాబు దర్శనం చేసుకొని కోటిలింగంగారి యింటి నుంచి వారిని తమ యింటికి తీసుకొని వచ్చారు. శ్రీబాబు పసివాడైన గోపాల్‌ను చూచి, అతనికేమీ ఆపద లేదని, మామూలు ఎదుగుదల వస్తుందని అభయమిచ్చారు.

-సశేషం

# గిరిజా విజయం

-సుశీలా ప్రసాద

సూర్యోదయ సమయాన హిమగిరి సొగసులు మరింతగా వన్నెలు దిద్దుకుంటున్నాయి. భానుని కంటె ఎత్తుగా ఉన్న హిమాలయ అగ్రభాగన ప్రవహించే సరస్సులోని పద్మాలను తమకి చేరువగా ఉన్నందున సప్తర్షులు తమ పూజలకి కోసుకుంటున్నారు. మానవులు పాడలేని గాంధార గ్రామంలో దేవతలలో సంగీత పాఠకులైన కిన్నరులు గానం చేస్తుంటే పర్వత ప్రాంతాలలోని వెదురు పొదలలో దూరిన గాలి ఆ మధుర సంగీతానికి శృతి చేస్తోంది. గంగానదీ జలాలలో తడపబడుతున్న దేవదారువృక్షాలు, అక్కడ సంచరించే కస్తూరి మృగాల శరీర పరిమళాలు నిండి ఉన్న హిమాలయ ప్రాంతం సౌందర్యం మనస్సును ఆకర్షించగా, సదాశివుడు తనకా తావు తగినదిగా ఎంచి, అక్కడొక కొండచరియపై తపస్సు చేయడానికి కూర్చున్నాడు.

శివగణాలైన ప్రమధులు సురపొన్న పూలను ధరించి, భూర్జవృక్ష పత్రాలను బట్టలుగా కట్టుకుని, మణిశిలను పూసుకుని ఆ చుట్టూ ఉన్న రాతిబండల పైన కూర్చున్నారు. భూమి, నీరు, గాలి, నిప్పు, ఆకాశం, సూర్య చంద్రులు తానే అయిన ఈశ్వరుడు తన రూపాంతరమే అయిన అగ్నిని సమిధలతో ప్రతిష్ఠాపన చేసి తపస్సుకి ఉపక్రమించాడు. తాను ఏమికోరి తపస్సు చేయటం మొదలు పెట్టాడు? త్రికాలజ్ఞుడైన త్రిలోచనుని కన్నుల వెనుక గతాగతములన్నీ గోచరించసాగాయి.

ఎంతో ఎత్తైన శిఖరాలు గల ఉత్తముడు హిమవంతుడు తనకు మేనక వలన మైనాకుడు కలిగాడు. నాగకన్యలకు నాథుడైన మైనాకుడు ఇంద్రుని వజ్రపాతం నుంచి తప్పించుకుని సముద్రునితో స్నేహం చేసి, అందే నివసించి ఉంటున్నాడు. దక్షతనయ సతీదేవి శరీరం విడిచిన అనంతరం, మైనాకుని తరువాత హిమవంతుని కుమార్తెగా జన్మించింది. పర్వతరాజ పుత్రిక అయినందున ఆమెను పార్వతి అని పిలువ సాగారు. ఆమె తండ్రికి గారాల తనయగా పెరిగింది. గతజన్మలో సిద్ధంగా ఉపదేశింపబడిన విద్యలన్నీ ఈ జన్మలో తమంతతామే ఆమెను పొందాయి. సృష్టిలో అందాలన్నీ ఒక చోట చూడాలన్న కోరికతో బ్రహ్మదేవుడు సమస్తమైన అందాలను పోగుచేసి రూపొందించినట్టుగా పార్వతి సర్వాంగ సౌందర్యవతి అయింది.

ఒకనాడు కామగమనంగల నారదుడు వచ్చి తండ్రి చెంతనే ఉన్న

పార్వతిని చూసి ప్రేమగా పరమేశ్వరుని అర్ధాంగం పొందగలవని, సవతులు లేని కాపురం గలదానివౌతావని ఆమెను ఆశీర్వదించాడు. ఆ దేవముని వాక్యాలు వింటూ హిమవంతుడు సందేహంలో పడ్డాడు. సతీదేవి దేహం విడచిన పిమ్మట శివుడు విషయాభిలాష విడచి, ఇతర స్త్రీల యందు వాంఛ లేకుండా ఉన్నాడు కదా! ఇదేలా సాధ్యమని అయినా మహాత్ముల వాక్కులెన్నడూ వృథా కావుకదా అని ఆలోచిస్తున్న ఆ సమయాన శివుడు తమకి దాపునే తపస్సుచేయ నారంభించాడని ఆయనకు తెలియవచ్చింది. వాని మనస్సులో ఒక ఆశ మెరసింది.

సమీపంలో సవ్వడి ఏదో వినరాగా శివుడు కనులు తెరచి చూశాడు. ఎదుట హిమవంతుడు వినయ భయభక్తులతో అంజలి ఘటించి నిలచి ఉన్నాడు. వెనుక తలవంచి నిలచి ఉన్నది వాని తనయ. సకల దేవతా పూజ్యుడైన హరుని అనుగ్రహ వీక్షణం వారిపై ప్రసరించగా ప్రసన్నమూర్తి అయిన స్వామిని హిమవంతుడు అర్ఘ్య పాద్యాదులతో పూజించాడు. పరమశివుని పెదవులపై చిరుదరహాసం కదలాడింది. దానితో ధైర్యం తెచ్చుకున్న పర్వతరాజు మహేశ్వరునికి శుశ్రూష చేసేందుకు తన కుమార్తె అయిన పార్వతిని నియమించగలందుకు అనుమతి నివ్వవలసిందిగా ప్రార్థనా పూర్వకంగా మనవి చేసుకున్నాడు. శివుడు ఒక్క క్షణం ఆలోచించాడు. మనస్సు వికారం పొందటానికి కారణం ఉన్నప్పుడు, ఎవరి చిత్తం చలించకుండా ఉంటుందో అట్టివారే కదా ధీరులు అని నిశ్చయించుకున్నాడు. తన తపస్సుకి ప్రతికూలురాలే అయినా పార్వతి శుశ్రూష చేయడానికి అంగీకరించాడు. తండ్రి కుమార్తెలు బ్రహ్మానంద పరవశులైనారు.

జయ విజయలనే సఖులతో వచ్చిన పార్వతి ఇప్పుడు రోజూ పరమశివుని పూజకోసం పువ్వులు కోసి తెస్తోంది. తపోవేదికనంతా తుడిచి శుభ్రం చేస్తోంది. స్వామి నిర్వ్యానుష్ఠానానికి నీళ్ళు తెస్తోంది. దర్భలుకోసి అమరుస్తోంది. ఇలాగ శివుని సేవలో ఆమెకి ఎంతో ఆనందం లభిస్తున్నందున తను అలసిపోతున్నాననే భావం ఆమెలో ఎక్కడా ఉండటం లేదు. అయినా పార్వతి శ్రమను తొలగించటానికి శివుని తలపై చంద్రుడు పూనుకొని తన చల్లని కిరణాలతో ఆమెను సేదతీరుస్తున్నాడు. భావిలో తన సేవా భాగ్యం పొందే అర్హత కలిగిన పార్వతిని గమనిస్తూ, శివుడు కాగల కార్యంవైపు దృష్టి మరలించి, అరమోడ్పు కనులలో దానిని అవలోకించ సాగాడు.

-సశేషం

# గురుబిడ్డ

శ్రీ గాదె కోదండ రామయ్యగారు సద్గురుమూర్తిని పరిపూర్ణ విశ్వాసంతో ఆశ్రయించి ఏరకమైన అసంతృప్తి లేక ఆశ్రమ జీవితాన్ని సార్థకం చేసుకున్న ధన్యజీవి. ఆయన మితభాషి. కార్యదక్షుడు.

తోటి సాధకులతో సాధన గురించి ఎప్పుడు మాట్లాడినా ఆశ్రమ జీవితమే ఒక సాధన. విభిన్న మనస్తత్వాలు, భిన్న అభిరుచులు గల సాధకులతో ఏరకమైన బేధాభిప్రాయాలు లేకుండా సామరస్యంతో మెలగటమే గొప్పసాధన అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు కోదండరామయ్యగారు.

శ్రీబాబూజీ మహరాజ్ సాధకులని హెచ్చరిస్తూ సంఘంలో ఉంటూ నిస్సంగుడుగా ఉండ గల్గినవాడే నిజమైన సాధకుడు. ప్రపంచంతో సంబంధం లేకుండా ఎక్కడో ముక్కుమూసుకుని ఏకాంతంగా సాధన చేసే సాధకుని మనోప్రవృత్తి తాత్కాలికంగా ప్రశాంతంగా ఉండవచ్చు. కాని సమయము వచ్చినప్పుడు మాయాశక్తి పంజాదెబ్బ కొడుతుంది అనేవారు.

శ్రీబాబూజీ మహరాజ్ చెప్పిన విధంగా సాధన కొనసాగించిన వ్యక్తులలో శ్రీకోదండ రామయ్యగారు అగ్రగణ్యులు ఆయన ఆశ్రమవాసులకు ఎన్నో విధాలుగా తాము చేయగలిగిన సహాయాన్ని అందించేవారు. ఈ దేహం ఉన్నంత వరకు చేయగల్గినంత సేవ చేయాలన్నదే నా ధ్యేయం అనేవారు.

ఒక పర్యాయము ఉద్యోగరీత్యా జీప్‌లో ప్రయాణం చేస్తూండగా యాక్సిడెంట్ జరిగింది. చెయ్యి ఫ్రాక్చర్ అయిందని వైద్యులంతా నిర్ణయించారు. ఎక్స్‌రే రిపోర్ట్ ఆధారంగా ఆపరేషన్ చేయటానికి కూడా కాల నిర్ణయం జరిగింది.

శ్రీబాబూజీ మహరాజ్‌వారికి విషయాన్ని తెలియజేసారు. వారు మాట్లాడుతూ "వైద్యులు చెయ్యి ఫ్రాక్చర్ అయిందని చెప్పారు. తగిన ఆధారాలు ఎక్స్‌రే రిపోర్టులో ఉన్నాయి. కాని ఆపరేషన్ అవసరం ఉండదులే" అన్నారు. నిర్ణయించిన తేదీన ఆపరేషన్ నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేశారు. తీరా ఆపరేషన్ అవసరం లేకుండా ఎముకలు సెట్ అయ్యాయి. ఫ్రాక్చర్ లేదు. వైద్యులు ఆశ్చర్యపోయారు. ఇలా ఎవరికి జరగదు. మీ ఎక్స్‌రే రిపోర్టులు మాకు ఇస్తే మేము మెడిసిన్ చదివే విద్యార్థులకు ఈకేసు గురించి చెబుతాము అని అభ్యర్థించారు.

ఈ సంఘటన జరిగిన తరువాత శ్రీబాబూజీ మహరాజ్‌ని కోదండరామయ్యగారు కలుసుకోవటం జరిగింది. శ్రీబాబూజీ దగ్గరకు వేరొక భక్తుడు రావటం జరిగింది. చాలామంది భక్తులు బాబూజీ దర్శనం కోసం వేచియున్నారు. అందువలన బాబూజీ దర్శనార్థం వచ్చిన భక్తుడు తనకి దర్శనం అవ్వటం దుర్లభం అని భావించి వెళ్ళిపోబోయే సందర్భంలో శ్రీబాబు ఆయనని పిలచి రెండు గంటల సమయం ఆ భక్తునికి తత్త్వబోధ అందజేయటం జరిగింది.

ఆ సందర్భంలో శ్రీ కోదండ రామయ్యగారితో మాట్లాడుతూ "సద్గురుమూర్తి సందర్శనం, స్పర్శనం, సేవకోసం విచ్చేసి భక్తుడు ఎవరైనా సరే, ఆ అవకాశం కలగకుండా నిరోధించే వ్యక్తి ఎంతటి సాధకుడైనా సద్గురుమూర్తికి ఎంతటి సన్నిహితుడైనా తప్పక ఈ జన్మలోగాని, మరుజన్మలోగాని, కాలికిగాని, చేతికిగాని ప్రమాదం సంభవించవచ్చు. అంతేకాదు మన కోదండ రామయ్యగారు చాలా విశాల దృక్పథం గలవారు. ఆయన ఎన్నడూ ఎవ్వరికీ ఏరకమైన హానీ తలపెట్టరు. అందువలననే సద్గురుమూర్తి అనుగ్రహంతో చేతికి సంభవించవలసిన ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇది మాత్రం సత్యం. మీ హృదయ బాబు ఎన్నడూ అసత్యం ఆడడు" అన్నారు.

సద్గురుమూర్తి అభయహస్త కిరణంలో ఆశ్రమవాసం చేసే సేవా తత్పరత కలిగిన శ్రీకోదండరామయ్యగారు గురుసాయుజ్యాన్ని పొంది, సాధకులందరికీ మార్గదర్శకులై విరాజిల్లుతున్నారు. *

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ మహరాజ్‌వారి ప్రియభక్తులైన కందర్ప వెంకటశ్యామ్ సోమ సుబ్బరాయశర్మగారు (సుబ్బారావుగారు) ది.28-1-2011 శుక్రవారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 70 సంవత్సరాలు. వీరికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు గలరు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెందరు గాక!

# మన సాధన ఎందుకు ఫలించటం లేదు?

(గతసంచిక తరువాయి)

-వెంకట రమణ ప్రసాద్

**మననము**

శ్రవణము తరువాత సాధకునకుమననమవసరము. తాను శ్రద్ధగా విన్నదానిని పలుమారులు తిరిగి తిరిగి గుర్తుచేసుకొని యాలోచించుటయే మననము. 'నేను దేహేంద్రియ మనోబుద్ధులలో నేదియునుకాను. అహంకారమునుగాను, జనన మరణలులేని సచ్చిదానంద స్వరూపుడగు ఆత్మను' అని మరువక నిరంతరము చింతించుచుండ వలెను. సాధకుని శ్రవణేంద్రియము నందీ మాటలు మార్మ్రోగవలెను. మనోవీధి యందీ భావమే కదలుచుండ వలెను. "నీ యంతరంగమున నిండి నీ శరీరమందలి ప్రతియణువు నందును ప్రవేశించ వలె'' నని పెద్దల యాదేశము. నిదిధ్యాస కలుగునంత వరకు మననము కొనసాగింపవలెను.

**నిదిధ్యాస**

శ్రద్ధతో, ఏకాగ్రచిత్తముతో మననము చేయుటవలన నిదిధ్యాస సిద్ధించును. సమాధికి నిదిధ్యాస ప్రారంభదశ యనవచ్చును. శ్రద్ధతో, ఏకాగ్ర చిత్తముతో మననము చేయుట వలన నిదిధ్యాస సిద్ధించును. సమాధికి నిదిధ్యాస ప్రారంభదశ యనవచ్చును. నిదిధ్యాస పరిపక్వమైనప్పుడు సమాధి యనబడును. సమాధి పొందిన తరువాత తత్వజ్ఞానము సిద్ధించును. అనగా బ్రహ్మమిట్టిదను అపరోక్ష జ్ఞానము కలుగును. అనగా మోక్షము సిద్ధించును. శ్రవణాదులు ఎంతవరకు చేయువలెనను ప్రశ్నకు బ్రహ్మసూత్రములో 'ఆవృత్తి రసకృదుపదేశాత్' అని చెప్పబడినది. (బ్రహ్మ. సూ. 4.1.1) అసకృత్. అనేక పర్యాయములు ఉపదేశించుట వలన , ఆవృత్తిః - ఉపాసనల ఆవృత్తి చేయాలి అని సూత్రార్థం. అంతేకాని క్రియాజపహోమాదులు ఒక సారి చేస్తే సరిపోయినట్లు, శ్రవణాదులు ఒకసారి చేస్తే చాలదు.

"ఆవర్త్యా దర్శనాన్తాస్తే తణ్డులాన్తా వఘౌ తవట్ అన్నట్లు 'ధాన్యం దంచవలెను' అనగా ధాన్యం నుండి బియ్యం వచ్చేంత వరకు దంచవలెననియే భావము. అందువలననే **"ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసి తవ్యః''** అని "ఆత్మను సాక్షాత్కరించుకొనవలెను, శ్రవణము చేయవలెను. మననము చేయవలెను. నిదిధ్యాస చేయవలెను'' అని మైత్రేయికి

యాజ్ఞవల్క్యుడు ఖండితముగా నుపదేశించెను. కనుక శ్రవణ మనన నిదిధ్యాసలను కొంచెమాచరించి, కృతకృత్యుడను కాలేకపోయితినని బాధపడి సాధన యాపివేయరాదు. సాక్షాత్కారపర్యంతరము సాధనకొన సాగించి తీరవలెనని శాస్త్ర నిర్దేశము.

## శ్రవణాదులు చేయలేనివాడేమి చేయవలెను?

ఒక చోట నుండి మరియొక స్థలమునకు పోవువాడు ఒకే మార్గమున పోవలెనను నియమేమియు లేదు. అనేక మార్గములలో పోవచ్చును. కొన్ని కొన్ని మార్గములు కొంతకొంతమందికి సుగముగను, మరికొందరకు దుస్తరముగను తోచవచ్చును. ఈ విషయమును శాస్త్రము గూడ చక్కగ పరిశీలించి ఎవనికి వీలైన, యనుకూలమైన మార్గము వాడెంచుకొని కృకృత్యుడు కావచ్చునని చక్కగ తెలియజేసినది.

ఉత్తమాధికారులైన కొందరు సాధకులకు శాస్త్రములు శ్రవణ మననాది మార్గమును మోక్ష సాధన మార్గముగా సూచించినది. మరి ఉత్తమాధికారులు కాని మధ్యమ, మందాధికారుల విషయమేమి? వారు ఆత్మసాక్షాత్కరమును పొందజాలరా? అని ప్రశ్నించినచో శాస్త్రములు శ్రవణాదుల వలన తత్వజ్ఞానమును సంపాదించుటకును సామర్థ్యము చాలనిచో, నిర్గుణ బ్రహ్మోపాసనను సూచించినది. అందుకును సామర్థ్యము లేనిచో సగుణ బ్రహ్మోపాసనము చేయమన్నది. వేదచోదితమైన సగుణ బ్రహ్మోపాసనము చేతగాని వారిని చిత్తశుద్ధికొరకు ఫలాపేక్ష లేకుండ యజ్ఞదాన తపముల నాచరింపుమని తెలిపినది. గీతలో భగవానుడు

**యజ్ఞో దానం తపః కర్మ నత్యాజ్యం కార్యమేవ తత్**
**యజ్ఞో దానం తపశ్చైవ కారణాని మనీషిణామ్**

అని చెప్పినాడు. శ్రీశంకరులు ఈ శ్లోకమును వ్యాఖ్యానించుచూ **"యజ్ఞః దానం తపః ఇత్యేతత్ త్రివిధం కర్మ న త్యాజ్యమ్. న త్యక్తవ్యమ్ కార్యం కరణీయం ఏవతత్. కస్మాత్? యజ్ఞః దానం తపః చ ఏవ పావనాని మనీషిణాం ఫలాభిసంధీనామ్ ఇత్యేతత్"** అన్నారు.

-సశేషం

## శ్రీసద్గురు చండీ రుద్రయాగం

-నివేదిక

ది.4.2.2011 నుండి 10.2.2011 వరకు జరిగిన **శ్రీ సద్గురు సప్తాహ సత్సంగ సమావేశములు**, ది.5.2.2011 నుండి. ది.9.2.2011 వరకు **పంచాహ్నిక శ్రీ సద్గురు చండీ రుద్రయాగము** శ్రీ బాబు భక్త సమాజ్ తుని(తూర్పు గోదావరిజిల్లా) వారు నిర్వహించారు.

సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీహనుమత్ కాళీ వర ప్రసాద్‌బాబూజీ మహరాజ్ వారి మహదాశీస్సులతో, శ్రీకాళీ వనాశ్రమ పీఠాధిపతులు పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి అనుగ్రహ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్య క్రమాల నివేదికను ఇక్కడ ప్రచురిస్తున్నాము.

ది. 4.2.2011 ఉదయం గం॥7.29నిలకు గణపతి పూజ, స్థలశుద్ధి, పుణ్యాహవచనము జరిగాయి. ఆ సాయంత్రం వేదస్వస్తి, 40 మంది ఋత్విక్కులతో సాధు మహాత్ములతో శ్రీ సద్గురుదేవుల **శోభాయాత్ర** అత్యంత వైభవంగా జరిగింది.

**శనివారం ది 5.2.2011 నుండి ది.9.2.2011 బుధవారం వరకు శ్రీసద్గురు చండీ యాగం పాంచాహ్నిక దీక్షతో జరిగింది.**

**నిత్యకార్యక్రమాలు**

బ్రహ్మ శ్రీ కొండూరి రామ సుబ్రహమణ్య ప్రసాద్‌గారి అధ్యర్యంలో 40 మంది ఋత్విక్కులచే ఈ యాగము నిర్వహింపబడినది. గోపూజానంతరం శ్రీమాతాజీవారు, కర్తలు యాగశాల ప్రవేశం చేశారు, శ్రీ మాజాజీ వారు చతుర్వేద మహాయాగశాలపూజ, అఖండ దీపారాధన చేశారు. వాస్తు మండప, నవగ్రహ మండప, యోగినీ మండప, నవగ్రహ మండప, సర్వతో భద్ర మండప, లింగతో భద్ర మండప ఆరాధనలు, వేద పారాయణ, 33 ఋత్విక్కులచే శతరుద్రీయపారాయణ, రుద్రా భిషేకం, రుద్రజపం, రుద్రహోమం, చండీహోమం, తీర్థ ప్రసాదాలు, సాయంకాల పూజ, నీరాజన మంత్ర పుష్పములు, దర్బారు సేవ జరిగాయి.

**విశేషకార్యక్రమాలు**

ది.5.2.2011 ఉదయంగం॥8.28నిలనుండి **అఖండ హరి నామ సంకీర్తన** శ్రీఅవధూతేంద్ర భక్త మండలివారు 100 మందితోపూజ్యపాదశ్రీ శ్రీరామంగారి

అధ్వర్యంలో జరిగినది. ది.10.2.2011 ఉదయం గం॥8.28నిలకు శ్రీమాతాజీ వారు మహామంగళహారతి ఇచ్చారు.

ది.6.2.2011(ఆదివారం)న సామూహిక సూర్యనారాయణ పూజలు, సూర్యనమస్కారములు జరిగాయి. శ్రీహనుమత్ కాళీ వర ప్రసాద్ ట్రస్ట్ హాస్పిటల్ అధ్యర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించి ఉచితవైద్య సేవలు అందించారు. రాత్రి గం॥ 1.17నిల ముహుర్తమునకు భక్తుల వివాహములు జరిగాయి.

ది.7.2.2011(సోమవారం)న భక్తులచే సామూహిక మృత్తిలింగ అభిషేకములు, బిల్వార్చన జరిగాయి.

ది.8.2.2011 (మంగళవారం) సామూహికకుంకుమపూజలు జరిగాయి.

ది.9.2.2011 ఉదయం గం॥11.19నిల ముహుర్తమునకు సామూహిక ఉపనయనాలు జరిగాయి. మధ్యాహ్నం 2 గం॥లనుండి 4గం॥ల వరకు సద్గురుహోమం, పూర్ణాహుతి, శివ పార్వతుల శాంతి కళ్యాణము, ఆశీర్వచనము, పండిత సత్కారము జరిగాయి.

ది.5.2.2011 నుండిది. 7.2.2011 వరకు సాధు ధర్మ సమ్మేళనం జరిగింది.

ది.5.2.2011 పరమహంస పరివాజికాచార్య పరమపూజ్య శ్రీశ్రీశ్రీ108 దండి నిర్మలానందగిరి స్వామి(అష్టలక్ష్మీపీఠం) వారు పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం సాధుధర్మ సమ్మేళనం ప్రారంభమైంది.

మొదటి సమావేశానికి పూజ్యశ్రీయోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారు,అద్యక్షతవహించాగా పరమపూజ్యశ్రీబ్రహ్మానంద తీర్థస్వాములవారు (శ్రీసత్యానందాశ్రమాధిపతులు ,ఇనమడుగు) , శ్రీధరస్వామీజీ ( శ్రీధరనిలయం ,ముక్కమల) ప్రసంగించారు.

రెండవ సమావేశానికి పరమహంస పరివాజికాచార్య పరమపూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు(శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, శ్రీకాళహస్తి) అద్యక్షత వహించగా,శ్రీశంకరానంద స్వాములవారు (శ్రీదత్తాత్రేయాశ్రమం, మంకాల),శ్రీరామకోటి రామకృష్ణానందస్వామి (శ్రీపురక్షేత్రం, ఈదురుబళ్ళాపురం), డాక్టర్ అశోక్ ప్రసాద్,Chief Medical Officer, S.KV.P.B Trust Hospital, 'శ్రీకాళీవనాశ్రమం, శ్రీఅభేదా నందస్వాముల వారు(శ్రీరామానంద యోగాశ్రమం-G.R పురం) ప్రసంగించారు.

6.2.2011 - 3వ సమావేశానికి పరమహంస పరివాజికాచార్య పరమపూజ్య శ్రీశ్రీశ్రీ108 దండి నిర్మలానందగిరి స్వామివారు (అష్టలక్ష్మీపీఠం,

తెనాలి) అద్యక్షత వహించగా పూజ్యశ్రీ నిత్యానందభారతి స్వాములవారు, (శ్రీగురుమందిరం, బళ్ళారి),పూజ్యశ్రీకృష్ణానందగిరిస్వాముల వారు (శ్రీగీతాశ్రమం, జి.మేడపాడు)పూజ్యశ్రీ జ్యోతిర్మయానంద మాతాజీ వారు (శ్రీ పరబ్రహ్మ షణ్ముఖానంద ఆశ్రమం) ప్రసంగించారు. పూజ్య శ్రీవిద్యాస్వరూపా నందగిరి స్వాములవారు(శ్రీశుకాశ్రమ పీఠాధిపతులు శ్రీకాళహస్తి) వారి కర కమలములద్వాం **భజనమాల** (సర్వనామ సంకీర్తనామృతం, సమర్థ సద్గురు పబ్లికేషన్స్) పుస్తకం ఆవిష్కరింపబడినది.

4వ సమావేశానికి పరమహంస పరివాజికాచార్య పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు(శ్రీవసిష్టాశ్రమాధిపతులు తిరుపతి),అద్యక్షత వహించాగా, పూజ్యశ్రీ బ్రహ్మ గాయత్రిగిరి మాతాజీవారు (శ్రీపురక్షేత్రం,ఈదురుబళ్ళాపురం), పూజ్యశ్రీ బ్రహ్మానంద తీర్థ స్వాములవారు (శ్రీ సత్యానందాశ్రమాధిపతులు, ఇనమడుగు), పూజ్యశ్రీదండి నిర్మలానందగిరి స్వామివారు(అష్టలక్ష్మీపీఠం, తెనాలి)పూజ్యశ్రీ స్వస్వరూపా నందగిరి స్వాములవారు (శ్రీవసిష్టాశ్రమాధిపతులు, తిరుపతి), పూజ్యశ్రీఅభేదా నందస్వాములవారు(శ్రీరామానందయోగాశ్రమం,G.R పురం ప్రసంగించారు.

7.2.2011 5వ సమావేశానికి పరమహంస పరివాజికాచార్య పరమపూజ్య శ్రీశ్రీశ్రీరామకోటి రామ కృష్ణానంద స్వాములవారు(శ్రీపురక్షేత్రం, ఈదురు బళ్ళాపురం) అద్యక్షత వహించగా ,పూజ్యశ్రీ శివానందగిరి స్వాములవారు (శ్రీయోగివేమనశ్రమం,బెంగుళూరు),పూజ్యశ్రీ కృష్ణానంద స్వాములవారు (శ్రీగీతాశ్రమం,జి.మేడపాడు),త్రినాధగురూజీ కాకినాడ)పూజ్యశ్రీ జ్యోతిర్మయానంద భారతి మాతాజీ (పరబ్రహ్మ షణ్ముఖానంద ఆశ్రమం, పాలకొల్లు) ప్రసంగించారు.

6వ సమావేశానికిపూజ్యశ్రీయోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారు అద్యక్షత వహించగా పూజ్యశ్రీ విద్యాస్వరూపానంద స్వాములవారు (శ్రీశుకాశ్రమ పీఠాధిపతులు శ్రీకాళహస్తి), పూజ్యశ్రీ బ్రహ్మానంద తీర్థ స్వాములవారు ( శ్రీ సత్యానందాశ్రమాధిపతులు, ఇనమడుగు), పూజ్యశ్రీ శివానంద మాతాజీ, పూజ్య శ్రీ దండి నిర్మలానందగిరి స్వామివారు, (అష్టలక్ష్మీపీఠం,తెనాలి), శ్రీఅభేదానంద స్వాములవారు (శ్రీరామానంద యోగాశ్రమం -G.R పురం) ప్రసంగించారు.

8.2.2011 న పూజ్యశ్రీ యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ వారి అధ్యక్షతలో ఉదయం -గురుసోదరులు - శ్రీవెంకటరమణ ప్రసాద్‌గారు, శ్రీతారక పరబ్రహ్మ ప్రసాద్‌గారు , గురుసోదరి శ్రీ సుషుమ్న ప్రసంగించారు. సాయంత్రం-గురుసోదరులు శ్రీమనోజ్ ప్రసాద్, శ్రీబ్రహ్మీ గాయత్రి మాతాజీ శ్రీపురం,ఈదురుబళ్ళాపురం), గురుసోదరి జపమాల ప్రసాద ప్రసంగించారు.

ది.10.2.2011యాగ కార్య క్రమానికి మకుటాయమానంగా శ్రీ సద్గురుదేవుల పాదపూజ అత్యంవైభవంగా జరిగింది. అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్నవారికి భజనమాల పుస్తకాలు ఇచ్చారు. యాగంలో వివిధసేవలు అందించిన వారందరిని శ్రీమాతాజీ ఆశీర్వదించారు.

అత్యంత వైభవంగా జరిగిన శ్రీ సద్గురు సప్తాహ సత్సంగ సమావేశ కార్యక్రమాలకు అసంఖ్యాకంగా భక్తులు వచ్చి మహాత్ముల దివ్య సందేశాలతో లబ్ధిని పొందారు. అనేక వేలమందికి అన్నదానం జరిగింది. ఈ విధంగా సమర్థ సద్గురుదేవులు శ్రీ బాబూజీ మహరాజ్ వారు తమ అవతారకాలంలో సంచరించి పావనం చేసిన తుని పట్టణ వాసులకు శ్రీమాతాజీవారి దివ్యాశీస్సులు, సాధుమహాత్ముల ఆశీర్వచనములు పుష్కళంగా లభించాయి.

## టీ.వి.లో శ్రీమాతాజీవారి కార్యక్రమాలు

*టి.వీ -(1) ఛానెల్‌లో 5గం॥30ని॥ నుండి ప్రతి రోజూ ప్రసారమౌతున్నాయి. భక్తులు విని తరించ గలరు.*




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

“ఉద్ధవుడు సమాధానం చెప్పాడు. వ్రజభూమి దగ్గరగా ఉన్న ఈ నీటిలో కాళియనాగు వాసం చేస్తున్నాడు. ఈ జలాశయానికి స్వామిత్వం అతడిదే దామోదరా! గోకులంలోని గోపికా కాంతలను తన జలాశయాన్నుంచి ఒక్క చుక్క కూడా నీరు తీసుకోనివ్వడు...”

“యమునపై స్వామిత్వం ఎలా సంభవం ఉద్ధవా?” కృష్ణుడు ఆశ్చర్యంతో ప్రశ్నించాడు. ఊరికి దగ్గరగా జలాశయం ఉండగా మంటుడెండలో గోపికలు కష్టపడుతూ దూరం నుంచి నీరు తేవటం చాలా అన్యాయం...”

“న్యాయాన్యాయాల గురించి నాకు ఎక్కువగా తెలియదు కృష్ణా” ఉద్ధవుడు తన మర్యాద సీమను దాటకుండా అన్నాడు. “నాకు తెలిసింది ఏమిటంటే ఈ జలాశయానికి వారు వెళ్ళరు.... ఎందుకంటే ఇది కాళియనాగుని అధికారంలో ఉంది....

“గాలి, నీరు, పృథ్వి, ఆకాశం, సూర్యుడు - ఇవి పంచభూతాలు ఉద్ధవా” ఏదో నిర్ణయించుకొన్నట్లుగా అన్నాడు కృష్ణుడు - వీటిపైన స్వామిత్వం ఎవ్వరికీ ఎలా ఉంటుంది?.... బహుజన హితాయ బహుజన సుఖాయ.... సమిష్టికోసం దాని రక్షణ జరగాలి... మనం ఈ కాళీయుని ఎదుర్కొందాం...”

కృష్ణుని కనులలో విరిసిన వింత కాంతిని చూసి ఉద్ధవుడు ఆశ్చర్య చకితుడైనాడు. కాళీయుడు పరాస్థుడైన ఆ క్షణంలో....

ఏమీ జరగనట్లే కృష్ణుడు మందహాసం చేస్తూ తటిపైన గుమికూడిన వ్రజవాసులను చూస్తున్నాడు... పరాస్థుడైన, లజ్జితుడైన కాళీయుడు అక్కడనే ఉన్నాడు. కృష్ణుడు ఇంకా అతని తలను పట్టుకునే ఉన్నాడు. అందరూ వినేటట్లుగా కృష్ణుడు “కాళీయా! పరాజయం నీ సామర్థ్యానికి కాదు. నీ భావనకు. నువ్వు నీ మలిన వృత్తి నుండి ముక్తుడవైతే నువ్వు నీ పరాజయాన్ని విజయంగా

మార్చుకొన్న వాడవు అవుతావు... వెళ్ళు.. ఇక ఎప్పుడూ ఈ జల ప్రవాహాన్ని కలుషితం చేయకు.... నిన్ను వదిలి వేస్తున్నాను!"

కృష్ణుడి పట్టునుండి విడివడిన కాళీయుడు ఒక్క క్షణం ఏకత్రమైన జన సముదయాన్ని చూశాడు. కృష్ణుని వైపు దీనంగా చూశాడు. ఉత్తరదిశ వైపుగా వెళ్ళిపోయాడు...

"కృష్ణా!" అందరూ భయాందోళనలతో ఉండటం గమనించి బలరాముడు ఇలా అన్నాడు "ఉత్తర దిశగా వెళ్ళిన కాళీయుడు ఖాండవ వనంలో సురక్షితంగా ఉంటాడు. కాని ఖాండవ వనంలో ఉంటూ మనకి శత్రువుగా వ్యవహరించడు కదా..."

కృష్ణుడు ఇలా అన్నాడు "అన్నగారూ! ఖాండవ వనం మనం చూడలేదు. కాళీయుడు మనపై శత్రుత్వం ప్రకటిస్తే కాళిందిలో అతనికి పట్టిన దశే పడుతుంది."

ఉద్ధవుడు రోమాంచితుడైనాడు... ఎన్నో సంవత్సరాల క్రిందట అర్జునుడు తన తీక్షణమైన బాణాలతో ఖాండవ వనాన్ని దహించివేశాడు!

ఈ కాళీయుని విషం ఎంతోమంది వినాశానికి కారణమైంది. ఉద్ధవుడు నలువైపుల దృష్టి సారించాడు. కొంతకాలం క్రిందట తనను గోకులానికి పంపాడు. ఆ విషయం జ్ఞప్తికి వచ్చింది... గోకులాన్ని విడిచి మధురకు వెళ్ళిన కృష్ణుడు రాజకార్యాలలో మునిగి గోకులంవైపు రావటానికి తీరిక దొరకలేదు! అప్పుడు ఉద్ధవుడు కృష్ణుని సందేశాన్ని పట్టుకొని ఇక్కడ వచ్చాడు... ఆ తరువాత ఇప్పుడు తను గోకులంలో అడుగు పెట్టబోతున్నాడు.

ఉద్ధవుడు ఆలోచనలో పడ్డాడు. క్రితంరోజు సాయంత్రం మధురకు వెళ్ళినప్పుడు తను అక్కడివారందరికీ అపరిచితుడు... గోకులంలో గోపస్త్రీల, గోపురుషుల ఎన్నో తరాలు గడిచాయి. ఒక్క రాధ.... రాధ మాత్రం తనను గుర్తు పట్టగలదు... రాధ కూడ గుర్తు పడ్తుందో లేదో.... మరుక్షణం ఉద్ధవుడు తనలో కలిగిన భావాలకి లజ్జితుడైయ్యాడు... రాసలీల జరిగిన ఆ అవిస్మరణీయమైన నాటి రాత్రి రాధ ఉద్ధవునితో అంది "ఉద్ధవా! గోకులంలోని జనపదం ఏక్షణం ముక్తి పొందుతుందో అదే క్షణం రాధపేరు కూడా గాలిలో కలిసిపోతుంది. ఈ మాట మరువ వద్దు....

ఉద్ధవుడి మనస్సు వికలమైంది...

ఉద్ధవుడు విహ్వలుడైనాడు.... తను తిరిగి ఆ ధూళిలో వెనక్కు వెళ్ళాలి కదా అని గుర్తుకొచ్చి అతని మనస్సు వికలమైంది.

అతని చిత్తం అతీతంలోకి పోయింది.....

కంసుడు గణతంత్రాన్ని వినాశనం చేసి గద్దెకెక్కాడు... అతని కన్ను గోకులంపై పడింది. అక్కడి జనుల సంపద చూసి అతని కన్ను కుట్టింది. ఇంతవరకు మధుర అగ్రజుడైతే గోకులం అనుజుడుగా మెలిగింది. గోకులంలోని ప్రజలు నందబాబా నేతృత్వంలో సుఖశాంతులతో స్వతంత్ర జీవనం సాగిస్తున్నారు. కాని కంసుడు గోకులంపైన తన అజమాయిషీ చేయటం ప్రారంభించాడు.

మగధ సామ్రాజ్యం ఎంతో శక్తిమంతమైనది. దాని అండదండలు కంసునికి ఉన్నాయి. మగధరాజైన జరాసంధుని పుత్రి కంసుని భార్యగా అతని అంతఃపురంలో ఉంటోంది. అందువలన మామగారైన జరాసంధుని సహాయసహకారాలు లభించాయి. గోకులం స్వతంత్రంగా ఉండటం కంసునికి ఇష్టంలేదు. నందునికి 'నా స్వామిత్వాన్ని స్వీకరించు, నెయ్యి, పాలు, వెన్న మొదలైనవి మధురకు పంపు' అని సందేశం పంపించాడు.

నందుడు భయపడ్డాడు. కంసుడు మధురలోని యాదవ సభను నిర్వీర్యం చేశాడు. అతని ముందు తను నిలబడి ఎదురించలేడు. అందువలన మధురతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. కంసుని స్వామిత్వం అంగీకరిస్తూ ప్రతిదినం గోరసాన్ని పంపటం ప్రారంభించాడు....

శక్తివంతమైన రాజ్యం. శక్తివంతమైన వారిదే ఎప్పుడూ పైచెయ్యి. కంసుని ఆజ్ఞను ధిక్కరించే సామర్థ్యం గోకులంలో ఎవరికి ఉంది!"

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL